# ప్రజా తపన

prajathapana.com

News that matters




సుఖమయం, శుభదాయకం, అయిన లోకం సామాజిక ప్రగతి, వేడి మంచు, నల్లని వెలుగుల్లా అసంబద్ధమైనవే. అనర్థాలను సృష్టించని భౌతిక అభివృద్ధి ఉండదు.

- స్వామి వివేకానంద


సంపుటి :01 సంచిక: 31 ఆదివారం 12 మార్చి 2023 మిరియాల. మంజునాథ ఆధ్వర్యంలో పేజీలు :08 ధర :05/-


# కొత్త ఫ్లూతో జరాభద్రం....

**ప్రజాతపన ,న్యూఢిల్లీ :**



హెచ్ 3 ఎన్ 2 ఇన్ఫ్లుఎంజా వైరస్ కారణంగా కర్ణాటక, హర్యానా ఒక్కొక్కరుగా మరణించినట్లు సమాచారం. ఈ వార్త అనంతరం కరోనావైరస్ కాలం తిరిగి వస్తుందనే భయం ప్రజల్లో భయాందోళన కలిగిస్తుంది. ఈ క్రమంలోనే ఆరోగ్య మంత్రిత్వ శాఖ కీలక ఆదేశాలు జారీ చేసింది. హెచ్3ఎన్2 ఇన్ఫ్లుఎంజాతో అనారోగ్యంతో ఉన్న పెద్దలు, పిల్లలు మరింత జాగ్రత్తగా ఉండాలని స్పష్టం చేసింది. మార్చి నెలాఖరు నాటికి జ్వరల కేసులు తగ్గుముఖం పడతాయని చెప్పారు. ప్రభుత్వం తెలిపిన వివరాల ప్రకారం, భారతదేశంలో ప్రతి సంవత్సరం రెండు సీజన్లలో ఫ్లూ విజృంభిస్తుంది. మొదట జనవరి నుండి మార్చి వరకు, రెండవది రుతుపవనాలు ముగిసిన తర్వాత. భారతదేశంలో వైరల్ ఫీవర్ కేసులు పెరుగుతున్న సమయం ఇది. ప్రస్తుతం దేశంలో ఓపీడీ లో జ్వరం, అడ్మిట్ అయిన రోగుల కేసులు ఎక్కువగానే నమోదవుతున్నాయని చెప్పారు. హెచ్ 3 ఎన్ 2 బాధితుల్లో సగం మంది.. ఐసిఎంఆర్ ప్రకారం, ఇన్ఫ్లుఎంజా ఎ యొక్క సబ్టైప్

(మిగతా 2లో)



# మే 24కు ముందే ఎన్నికలు..

## వెల్లడించిన సీఈసీ

**బెంగళూరు :**

కర్ణాటక అసెంబ్లీ గడువు 2023 మే 24తో ముగియనుందని, ఈలోపుగానే అసెంబ్లీ ఎన్నికలు నిర్వహిస్తామని చీఫ్ ఎలక్షన్ కమిషనర్ రాజీవ్ కుమార్ తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల సంసిద్ధతను సమీక్షించేందుకు బెంగళూరు వచ్చిన రాజీవ్ కుమార్ శనివారంనాడిక్కడ మీడియాతో మాట్లాడుతూ, సీనియర్ సిటిజన్లు, పీడబ్ల్యూడీ ఓటర్ల సౌలభ్యం కోసం పోలింగ్ స్టేషన్లలో అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. తొలిసారి 80 ఏళ్లు పైబడిన 12.15 లక్షల మందికి, 5.55 లక్షల మంది బెంచ్‌మార్క్డ్ పీడబ్ల్యూడీ ఓటర్లకు ఇంటి నుంచే ఓటు వేసే సౌకర్యం కల్పించనున్నట్టు చెప్పారు. కర్ణాటకలో 100 ఏళ్ల పైబడిన ఓటర్లు

(మిగతా 2లో)

# చిత్తూరు జిల్లాలో ముగిసిన లోకేశ్ యువగళం

**40 రోజుల పాదయాత్రలో 22 కేసులు**



టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ చేపట్టిన యువగళం పాదయాత్ర జనవరి 27వ తేదీన కుప్పం నుంచి ప్రారంభించిన సంగతి తెలిసిందే. యువగళం పాదయాత్రకు టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు బ్రహ్మరథం పడుతున్నారు. యువగళం పాదయాత్ర ప్రారంభించక ముందు నుంచి అనేక అడ్డంకులు ఎదురైనా విజయవంతంగా ప్రారంభించిన నారా లోకేశ్ పాదయాత్రను కొనసాగిస్తూ వస్తున్నారు. అయితే ఏపీ ప్రభుత్వం జారీ చేసిన జీవో నెంబర్-1 నిబంధనల ప్రకారం లోకేశ్ తన పాదయాత్ర కొనసాగించాలని పోలీసుల నుంచి ఆదేశాలు జారీ చేసింది. ప్రభుత్వ నిబంధనలకు లోబడి పోలీసుల ఆంక్షల మేరకు నారా లోకేశ్ పాదయాత్ర నిర్వహిస్తూ ప్రజల సమస్యలను

(మిగతా 2లో)

# తేజస్వీయాదవ్ కు సీబీసీ సమన్లు

**పాట్నా**



దేశవ్యాప్తంగా ఈడీ సోదాలు కొనసాగుతూనే ఉన్నాయి. ఆయా రాష్ట్రాల్లోని స్కామ్ కేసుల్లో భాగంగా విచారణ చేపడుతోంది. ఈ క్రమంలోనే లాలూ ప్రసాద్ యాదవ్ రైల్వే మంత్రిగా ఉన్నప్పుడు ల్యాండ్ ఫర్ జాబ్ స్కామ్ జరిగిందని ఆరోపిస్తున్న అధికారులు దీని విచారణ ప్రారంభించారు. ఢిల్లీ, ముంబయి, పట్నాల్లో ఇప్పటికే సోదాలు జరిగాయి. బిహార్ డిప్యూటీ సీఎం తేజస్వీ యాదవ్ ఇంట్లోనూ సోదాలు నిర్వహించారు ఈడీ అధికారులు. అటు సీబీఐ కూడా రంగంలోకి దిగి ఈ కేసుని విచారిస్తోంది. ఈ ప్రక్రియ పూర్తైన వెంటనే తేజస్వీ యాదవ్‌కు సమన్లు జారీ చేసింది. వెంటనే విచారణకు హాజరు కావాలని ఆదేశించింది. ల్యాండ్ ఫర్ జాబ్ స్కామ్‌లో ఆయన హస్తమూ ఉందని అనుమానిస్తోంది సీబీఐ. ఇదే కేసులో ఫిబ్రవరి 4వ తేదీన సమన్లు జారీ చేసిన సీబీఐ ఇప్పుడు మరోసారి సమన్లు పంపింది. ఢిల్లీ, ముంబయి, పాట్నాలో ప్రస్తుతం సోదాలు జరుగుతున్నాయి. ల్యాండ్ ఫర్ జాబ్ స్కామ్ విచారణలో భాగంగా ఈ మూడు చోట్ల సోదాలు చేస్తున్నారు అధికారులు. ఢిల్లీలోనే 15 చోట్ల సోదాలు చేశారు. లాలూ ప్రసాద్ యాదవ్

(మిగతా 2లో)




# కమలం గూటికి నల్లారి..?

**తిరుపతి:**

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి బీజేపీలోకి చేరోబుతన్నట్టు సమాచారం. 2014ను ఆయన రాజకీయ అజ్ఞాతంలో ఉన్నారు. ఎలాంటి రాజకీయా కామెంట్స్ కానీ, రాజకీయాలపై అభిప్రాయాలు కాని చెప్పడం లేదు. ఉమ్మడి ఏపీకి చివరి సీఎంగా పని చేసిన ఆయన విభజన సమయంలో సమైక్యవాదాన్ని ఎత్తుకున్నారు. తర్వాత జరిగిన కీలక పరిణామాలతో రాజకీయాలకు దూరంగా ఉంటూ వచ్చారు. ఎన్నికలకు ఏడాదికిపైగానే ఉన్నప్పటికీ ఆంధ్రప్రదేశ్‌లో రాజకీయాలు అప్పుడే రాజుకుంటున్నాయి. ఇప్పటికే వ్యూహప్రతివ్యూహాలతో తెలుగుదేశం, వైసీపీ ప్రజల్లో ఉండేలా ప్లాన్ చేస్తుంటే ఇప్పుడు బీజేపీ కూడా ఎత్తుగడలు వేస్తోంది. ప్రజల్లో ఉండేలా కార్నర్ మీటింగ్స్, ప్రజాసమస్యలపై పోరాటాల పేరుతో ఆ పార్టీ నేతలు చేస్తున్న పోరాటాలు చేస్తున్నారు.

(మిగతా 2లో)

# 10 ఏళ్ల జనసేన..భారీ బహిరంగసభ




**విజయవాడ:**

జనసేన అధినేత పవన్ కళ్యాణ్ నాలుగు రోజులు పాటు పర్యటన షెడ్యూల్ ఖరరారైంది. 14వ తేదీన జనసేన పార్టీ ఆవిర్భావ సభ నిర్వహించనుండగా అంతకు మూడు రోజులు ముందు పవన్ షెడ్యూల్ ను ఫిక్స్ చేసుకున్నారు..జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని నాలుగు రోజుల షెడ్యూల్ ను పవన్ కళ్యాణ్ ఖరారు చేసుకున్నారు. మార్చి 12వ తేదీన పార్టీ నేతలతో కలసి పవన్ కళ్యాణ్ సమీక్షిస్తారు. అదే సమయంలో పార్టీలో కొందరు నేతలు, కార్యకరక్తల చేరికల కార్యక్రమాన్ని పార్టీ నాయకత్వం ప్లాన్ చేసింది.అంతే కాదు మధ్యాహ్నం నుంచి మరో కీలక సమావేశం పవన్ నిర్వహిస్తారు. చేగొండి హరి రామజోగయ్య ఆధ్వర్యాన కాపు సంక్షేమ సేన ప్రతినిధులతోనూ పవన్ సమావేశం అవుతారు. మార్చి 13వ తేదీన 11 గంటలకు ఆవిర్భావ సభ ఏర్పాట్లపై సమీక్ష నిర్వహిస్తారు. అదే రోజు సాయంత్రం ఐదు గంటలకు ఏపీ గవర్నర్ అబ్దుల్ నజీర్ తో మర్యాదపూర్వకంగా భేటీ అవుతారు. 14వ తేదీ మధ్యాహ్నం ఒంటిగంటకు మంగళగిరి కార్యాలయం నుంచి జనసేన ఆవిర్భావ సభకు బయలుదేరతారు. సాయంత్రం ఐదు గంటలకు మచిలీపట్నంలోని సభా ప్రాంగణానికి చేరుకుంటారు. పార్టీ శ్రేణులు ఆవిర్భావ సభ ఏర్పాట్లలో తలమునకలై ఉన్నాయి. పెద్ద ఎత్తున పవన్ కళ్యాణ్ కు ఘన స్వాగతం పలికేందుకు, తాడిగడప.. పోరంకి, పెనమలూరు, పామర్రులో అభిమానులు కార్యకర్తలు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు.జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని నియోజకవర్గాల వారీగా ఇప్పటికే పార్టీ నాయకత్వం ప్రత్యేకంగా సమన్వయకర్తలను కూడ నియమించారు.

(మిగతా 2లో)

ప్రజాతపన
prajathapana.com
News that matters

# కొత్త ఫ్లూతో జరాభద్రం....

(మొదటిపేజీ తరువాయి)

హెచ్ 3 ఎన్ 2 డిసెంబర్ 15 నుండి అన్ని జ్వరాలలో సగం మందిలో గుర్తించినట్టుగా చెప్పింది. ఆసుపత్రిలో చేరిన రోగులలో సగం మంది హెచ్ 3 ఎన్ 2 బాధితులే. మొత్తం అడ్మిట్ అయిన రోగులలో, 92% మంది జ్వరం, 86% దగ్గు, 27% మంది శ్వాస తీసుకోవడంలో ఇబ్బందిని ఎదుర్కొంటున్నారు. అదే సమయంలో, 16% మందికి శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, 16% మందికి న్యుమోనియా, 6% మందికి మూర్ఛలు ఉన్నాయి. హెచ్ 3 ఎన్ 2 రోగులలో 10% మందికి ఆక్సిజన్ అవసరం, 7% మందికి ఐసియూ అవసరంగా ఉందని చెప్పింది.ఆరోగ్య మంత్రిత్వ శాఖ వివరణ.. మార్చి 9 వరకు, దేశంలో 3038 హెచ్ 3 ఎన్ 2 ఇన్ఫ్లుఎంజా వైరస్ కేసులు నిర్ధారించబడ్డాయి. వీటిలో జనవరిలో 1200 కేసులు, ఫిబ్రవరిలో 1300 కేసులు నమోదయ్యాయి. మార్చి నెలలో మార్చి 9 వరకు మాత్రమే 486 కేసులు నమోదయ్యాయి. అన్ని రకాల వైరల్ ఫీవర్లను కలిపి చూస్తే జనవరి నెలలో దాదాపు 4 లక్షల కేసులు నమోదు కాగా, ఫిబ్రవరిలో 4 లక్షల 36 వేలు, మార్చి 9 రోజుల్లోనే దాదాపు 1 లక్ష 33 వేల కేసులు నమోదయ్యాయి.జనవరిలో 7041 మంది రోగులు అడ్మిట్ కావాల్సి ఉంది. ఇప్పటివరకు ఫిబ్రవరిలో 6919 మంది, మార్చిలో 1866 మంది రోగులు అడ్మిట్ అయ్యారు. జనవరి, ఫిబ్రవరి నెలల్లో 955 హెచ్1ఎన్1 కేసులు కూడా నమోదయ్యాయి. హెచ్ 1 ఎన్ 1 చరిత్ర.. 2009-2010 సంవత్సరంలో హెచ్ 1 ఎన్ 1 భారతదేశంలో విధ్వంసం సృష్టించింది. అప్పుడు దాన్ని సాధారణ భాషలో స్వైన్ ఫ్లూగా చెప్పుకున్నారు. భారతదేశంలోని ఐసిఎంఆర్ యొక్క 27 పరిశోధనా ప్రయోగశాలలు కూడా ఈ కేసులను అధ్యయనం చేస్తున్నాయి. అధ్యయనం ప్రకారం, ప్రస్తుతం భారతదేశంలో మూడు రకాల వైరస్‌లు చురుకుగా ఉన్నాయి. ఇందులో ఇన్ఫ్లుఎంజా ఎ వైరస్ అత్యంత ప్రబలమైన ఉప రకం హెచ్ 3 ఎన్ 2.

ఐసిఎంఆర్ సలహా మేరకు.. హెచ్ 3 ఎన్ 2 వ్యాధిలో ఇది ఇతర వైరస్‌ల కంటే చాలా ప్రమాదకరమైనది. దీనితో బాధపడుతున్న రోగులు ఆసుపత్రిలో చేరవలసి ఉంటుంది.

### దీన్ని నివారించడానికి ఐసిఎంఆర్ సూచించింది.

1. మాస్క్ ధరించండి. ప్రస్తుతానికి రద్దీగా ఉండే ప్రదేశాలకు దూరంగా ఉండండి.
2. దగ్గేటప్పుడు, తుమ్మేటప్పుడు ముక్కు, నోటిని కవర్ చేసుకోండి.
3. కళ్ళు, ముక్కును పదేపదే తాకవద్దు.
4. మీకు జ్వరం, శరీర నొప్పి ఉంటే, పారాసెటమాల్ తీసుకోండి.
5. ఒకరితో ఒకరు కరచాలనం చేసుకోకండి.
6. బహిరంగ ప్రదేశాల్లో ఉమ్మివేయవద్దు.
7. డాక్టర్ చెబితే తప్ప, యాంటీబయాటిక్స్ తీసుకోవద్దు.
8. సమూహంలో కలిసి కూర్చొని ఆహారం తినడం మానుకోండి.

# మే 24కు ముందే ఎన్నికలు..

(మొదటిపేజీ తరువాయి)

17,000 మందికి పైగానే ఉన్నట్టు ఆయన తెలిపారు.

కర్ణాటకలో గత అసెంబ్లీ ఎన్నికలు 2018 మేలో జరిగాయి. ఎన్నికల అనంతరం జనతాదళ్ (సెక్యులర్), కాంగ్రెస్ పార్టీ కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. జేడీఎస్ నేత హెచ్‌డీ కుమారస్వామి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టారు. అయితే ఆ తర్వాత పలు రాజకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి. కాంగ్రెస్, జేడీఎస్ సభ్యులు పలువురు అసెంబ్లీకి రాజీనామా చేయడంతో కూటమి ప్రభుత్వం కుప్పకూలింది. బీఎస్ యడియూరప్ప సారథ్యంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటైంది. 2021 జూలై 26న యడియూరప్ప ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయడంతో ఆయన స్థానంలో జూలై 28న బసవరాజ్ బొమ్మై సీఎంగా పగ్గాలు చేపట్టారు. 2018లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో 222 స్థానాలకు గాను బీజేపీ 104 స్థానాలు గెలుచుకోగా, కాంగ్రెస్ 78 సీట్లు సాధించింది జనతా దళ్ (సెక్యులర్) 37 సీట్లు కైవసంచేసుకుంది. కర్ణాటక ప్రజ్ఞావంత జనతా పార్టీ, బహుజన్ సమాజ్ వాదీ పార్టీ చెరో సీటు గెలుచుకున్నాయి. ఒక ఇండిపెండెంట్ సైతం గెలుపొందారు.

# చిత్తూరు జిల్లాలో ముగిసిన లోకేశ్ యువగళం

(మొదటిపేజీ తరువాయి)

నేరుగా అడిగి తెలుసుకుంటూ నలభై రోజుల పాటు దిగ్విజయంగా పాదయాత్రను కొనసాగించారు. అయితే రేపు, ఎల్లుండి లోకేశ్ పాదయాత్రకు విరామం ప్రకటించనున్నారు. నారా లోకేశ్ యువగళం పాదయాత్ర నలభై రోజులు పూర్తి చేసుకుని నలభై ఒకటో రోజున తంబళ్లపల్లె నియోజకవర్గంలో కొనసాగుతుంది. అయితే ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కోడ్ ఉన్నందున రేపు, ఎల్లుండి పాదయాత్రకు నారా లోకేశ్ విరామం ప్రకటిస్తున్నట్లు తెలుస్తోంది. జనవరి 27వ తేదీన మొదలైన ఈ పాదయాత్ర నిన్నటితో నలభై రోజులు పూర్తి చేసుకుంది. ఈ క్రమంలో జీవో నెంబర్ -1 కు వ్యతిరేకంగా ప్రవర్తించారంటూ నారా లోకేశ్ పై 22 కేసులు నమోదు చేయడంతో పాటు మొత్తం 76 మంది టీడీపీ నేతలపై కేసులు నమోదు అయ్యాయి. ఇప్పటి వరకూ ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 13 నియోజకవర్గాలు పూర్తి చేసుకుని, అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లెలో నలభై ఒకటో రోజు యువగళం పాదయాత్రలో నారా లోకేశ్ పాల్గొంటున్నారు. నలభై రోజుల పాటు జరిగిన యువగళం పాదయాత్రలో మొత్తం 520 కిలోమీటర్ల మేర లోకేశ్ యువగళం పాదయాత్ర సాగింది. లోకేశ్, అచ్చెన్నాయుడుతో సహా 76 మందిపై పోలీసులు కేసులు పెట్టారు. అయితే ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ దృష్ట్యా పాదయాత్రకు నారా లోకేశ్ రేపు, ఎల్లుండి విరామం ప్రకటించారు. తిరిగి ఈ నెల 14వ తేదీన లోకేశ్ యువగళం పాదయాత్రను తిరిగి తంబళ్లపల్లె నియోజకవర్గంలో ప్రారంభించనున్నారు. : చిత్తూరు జిల్లాలో ముగిసిన లోకేశ్ యువగళం, 40 రోజుల పాదయాత్రలో 22 కేసులుసీఎం జగన్ పాలనలో అందరూ బాధితులేనని నారా లోకేశ్ విమర్శించారు. చిత్తూరు జిల్లా తంబళ్లపల్లె నియోజకవర్గంలో లోకేశ్ పాదయాత్ర కొనసాగుతుంది. అంగళ్లలో నారా లోకేశ్ చూసేందుకు ప్రజలు, టీడీపీ కార్యకర్తలు భారీగా తరలివచ్చారు. లోకేశ్ ను కలిసి అంగళ్లు నిర్వహిస్తున్న యువకులు, మహిళలు, వృద్ధులు తమ సమస్యలు చెప్పుకున్నారు. నిత్యావసర సరుకుల ధరలు విపరీతంగా పెరిగిపోయాయని మహిళలు ఆవేదన చెందారు. కరెంట్ బిల్లు ఎక్కువ వచ్చిందని పెన్షన్ కట్ చేశారని పలువురు వృద్ధులు వాపోయారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేక బెంగుళూరు వెళ్లి పనులు చేసుకుంటున్నామని అంగళ్లు నిర్వహిస్తున్న యువకులు అన్నారు. లోకేశ్ మాట్లాడుతూ.. జగన్ పెట్రోల్, డీజిల్ పై వేస్తున్న పన్నుల కారణంగానే నిత్యావసర సరుకుల ధరలు విపరీతంగా పెరిగిపోయాయని ఆరోపించారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే నిత్యావసర సరుకుల ధరలు తగ్గేలా చర్యలు తీసుకుంటామన్నారు. సీఎం జగన్ అడ్డగోలుగా పెంచిన అన్ని పన్నులు తగ్గిస్తామని తెలిపారు. రాష్ట్రంలో 6 లక్షల పింఛన్లను వైసీపీ ప్రభుత్వం తొలగించిందని లోకేశ్ ఆరోపించారు. చివరికి చెత్త పన్ను కూడా పింఛన్ లో కట్ చేసే దారుణమైన ప్రభుత్వం వైసీపీదని విమర్శించారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే బడా కంపెనీలు రాష్ట్రానికి వస్తాయన్నారు.

# కమలం గూటికి నల్లారి..?

(మొదటిపేజీ తరువాయి)

వచ్చే ఎన్నికల్లో కచ్చితంగా గెలుస్తామని చెబుతున్నారు. అయినా అందుకు సరిపడా బలం మాత్రం కనిపించడం లేదు. అందుకే ఏపీలో బలోపేతం అయ్యేలా పెద్ద ఎత్తున చేరికలను ప్రోత్సహించేలా వ్యూహాలను బీజేపీ రచిస్తోంది. అందులో భాగంగా
ఉమ్మడి ఏపీ మాజీ ముఖ్యమంత్రి నల్లారి కిరణ్ కుమార్ రెడ్డిని పార్టీలో చేర్చుకోవాలని ప్రయత్నిస్తున్నట్టు సమాచారం. ఆయన కూడా దీనికి అంగీకరించారని బీజేపీ వర్గాలు చెబుతున్నాయి. త్వరలోనే చేరిక ఉంటుందన్నది వారి అభిప్రాయం.బీజేపీ అగ్రనేత, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ఆదివారంలో ఓ కార్యక్రమంలో ఆయన పాల్గొంటారు. ఈ సందర్భంగా కిరణ్ కుమార్‌రెడ్డి ఆయనతో సమావేశం కానున్నారని తెలుస్తోంది. ఆయన బీజేపీలో చేరికపై ఇప్పటికే ప్రాథమిక చర్చలు జరిగిపోయాయని.. ఇప్పుడు ఫైనల్‌గా అమిత్‌షాతో మాట్లాడబోతున్నారని తెలుస్తోంది. ఆంధ్రప్రదేశ్ విభజన సమయంలో సమైక్యవాదాన్ని ఎత్తుకున్న కిరణ్‌కుమార్‌రెడ్డి కాంగ్రెస్‌కు పెద్ద షాకే ఇచ్చారు. ఓ ముఖ్యమంత్రిగా ఉంటూనే ఆయన ఎదురు తిరగడం అప్పట్లో పెను సంచలనమైంది. సమైక్యవాదానికి అనుకూలంగా ప్రెస్‌మీట్‌లు పెట్టిమరీ విభజనకతో కలిగే నష్టాలు వివరించారు. దీంతో ప్రభుత్వమే రెండు వర్గాలుగా చీలిపోయింది. అయినా వెనక్కి తగ్గకుండా ఆందోళన కార్యక్రమాలు కూడా చేపట్టారు. సీఎంగా కిరణ్‌కుమార్ రెడ్డి చెప్పిన మాటలను అధిష్ఠానం పెద్దగా పట్టించుకోలేదు. రాష్ట్రాన్ని విభజించేసింది. దీంతో కిరణ్ కుమార్ రెడ్డి కాంగ్రెస్ నుంచి బయటకు వచ్చేసి సమైక్యాంధ్ర పేరుతో పార్టీ పెట్టారు. చెప్పు గుర్తుపై పోటీ చేసి 2014 ఎన్నికల్లో ఘోర పరాజయం పాలయ్యారు. తర్వాత ఆ పార్టీ కాలగర్భంలో కలిసిపోయింది. మళ్లీ కాంగ్రెస్ గూటికి చేరారు కిరణ్ కుమార్ రెడ్డి. కాంగ్రెస్ లో చేరినా ఎప్పుడూ యాక్టివ్‌గా కనిపించలేదు కిరణ్‌కుమార్‌రెడ్డి. జాతీయ స్థాయిలో బాధ్యతలు ఇవ్వలేదు. ఏపీలో కీలక బాధ్యతలు ఇచ్చేందుకు అధిష్ఠానం చర్చలు జరిపినా ఆయన ఆసక్తి చూపలేదన్నది కాంగ్రెస్ నేతలు చెప్పే మాట. ఇప్పుడు ఏపీ సహా దేశంలో కాంగ్రెస్ ఉన్న పరిస్థితిలో అక్కడ ఉంటే ఎలాంటి ప్రయోజనం ఉండదని గ్రహించిన కిరణ్ కుమార్ పార్టీ మారేందుకు నిర్ణయించుకున్నట్టు తెలుస్తోంది. కిరణ్ కుమార్ రెడ్డి పార్టీ మారుతున్నారంటూ ఎప్పటి నుంచో ఊహాగానాలు నడుస్తున్నాయి. ఓసారి టీడీపీ అని మరోసారి వైసీపీ అని ఇలా రకరకాలుగా ప్రచారం జరిగింది. ఆయన మాత్రం ఎక్కడా ఆ విషయాలపై రియాక్ట్ కాలేదు. తన అభిప్రాయాన్ని చెప్పలేదు. ఈ మధ్య ఓ టాక్‌షోలో పాల్గొన్నప్పటికీ రాజకీయాలపై ఏం మాట్లాడలేదు. అమరావతి పై మాత్రం రియాక్ట్ అయ్యారు. ఇప్పుడు ఆయన చూపు బీజేపీపై పడిందని టాక్ నడుస్తోంది. బీజేపీ, కిరణ్ కుమార్ రెడ్డి మధ్య ఎప్పటి నుంచో చర్చలు నడుస్తున్నట్టు తెలుస్తోంది. గతంలోనే బీజేపీ జాతీయ అధ్యక్షుడు నడ్డా, హోంమంత్రి అమిత్‌షాతో కలిసినట్టు సమాచారం. ఇప్పటికే సీనియర్ నేత కన్నా లక్ష్మీనారాయణ పార్టీని వీడిన వేళ కిరణ్ కుమార్ రెడ్డి లాంటి వ్యక్తి పార్టీలోకి వస్తే బ్యాలెన్స్ అవుతుందన్నది బీజేపీ నాయకత్వం వ్యూహంగా ఉంది. రాయలసీమలో కూడా ఈయనతో బీజేపీ గెయిన్ కావచ్చని తెలుస్తోంది.కిరణ్‌కుమార్‌రెడ్డి బీజేపీలో చేరితే కీలక బాధ్యతలు అప్పగించాలని అది .నాయకత్వం భావిస్తోంది. అమిత్‌షాతో చర్చలు సఫలమై పార్టీలో కిరణ్ కుమార్ రెడ్డి చేరితే దక్షిణాది పార్టీ బాధ్యతలు అప్పగించే అవకాశం ఉంది.

# ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు

**నంద్యాల**

ఉపాధ్యాయ, పట్టభద్రుల, స్థానిక సంస్థల ఎన్నికల పోలింగ్ నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లుతో సర్వం సిద్ధం చేశామని జిల్లా కలెక్టర్ డా.మనజీర్ జిలాని సామూన్ పేర్కొన్నారు. శనివారం కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ లో జిల్లా ఎస్పీ రఘువీర్ రెడ్డి తో కలిసి పటిష్ట పోలింగ్ ఏర్పాట్లపై మీడియా విలేకరులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డా.మనజీర్ జిలాని సామూన్ మాట్లాడుతూ ఈ నెల 13న జరుగనున్న ఉపాధ్యాయ, పట్టభద్రుల, స్థానిక సంస్థల ఎన్నికల పోలింగ్ నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. భారత ఎన్నికల సంఘం ఫిబ్రవరి 16వ తేదీన ఎమ్మెల్సీ ఎన్నికలకు నోటిఫికేషన్ జారీ చేసిందని ఈ మేరకు ఫిబ్రవరి 23వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరించామన్నారు. జిల్లాలో పట్టభద్రులకు సంబంధించిన మొత్తం ఓటర్లు 54,929 మంది ఉన్నారని ఇందులో 38,695 మంది పురుషులు కాగా 16,230 మంది స్త్రీలు, ఇతరులు నలుగురు ఉన్నారన్నారు. అలాగే ఉపాధ్యాయులకు సంబంధించి మొత్తం ఓటర్లు 4426 మందికి ఉన్నారని ఇందులో 2806 మంది పురుషులు కాగా 1619 స్త్రీలు, ఇతరులు ఒకరు ఉన్నారన్నారు. గ్రాడ్యుయేట్లకు 61 పోలింగ్ స్టేషన్లో, టీచర్లకు 30 పోలింగ్ స్టేషన్లో, స్థానిక సంస్థలకు సంబంధించి మూడు పోలీస్ స్టేషన్లో ఓటర్లు ఓటు వేసేందుకు అన్ని వసతులు సమకూర్చామన్నారు. లోకల్ అథారిటీ ఎన్నికలకు సంబంధించి డోన్ డివిజన్లో 171, నంద్యాలలో 242, ఆత్మకూరు డివిజన్ లో 168 మంది వెరసి మొత్తం 578 మంది ఓటర్లు ఉన్నట్లు కలెక్టర్ వివరించారు.



సమస్యాత్మకంగా గుర్తించిన 9 లొకేషన్లలో అదనపు భద్రత ఏర్పాటు చేయడంతో పాటు వీడియో గ్రాఫర్లను ఏర్పాటు చేసి వీడియోగ్రఫీని తీయిస్తున్నట్లు కలెక్టర్ వివరించారు. అన్ని పోలింగ్ స్టేషన్లో 473 మంది పోలింగ్ అధికారులకు రెండు దఫాలుగా పూర్తిస్థాయి శిక్షణ ఇచ్చి స్వేచ్ఛాయుత వాతావరణంలో పోలింగ్ నిర్వహించేలా పటిష్ట చర్యలు తీసుకున్నామన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో వెబ్ కాస్టింగ్ నిర్వహించడం జరుగుతుందని... పోలింగ్ తీరును ఫ్యూటేజ్ ద్వారా జిల్లాలోని కమాండ్ కంట్రోల్ రూమ్, రాష్ట్ర ఎన్నికల ప్రధాన కార్యాలయం వీక్షిస్తుందన్నారు. దీంతోపాటు పోలింగ్ ప్రక్రియను క్షుణ్ణంగా పరిశీలించేందుకు118 మంది మైక్రో పరిశీలకులకు సంపూర్ణ శిక్షణ ఇచ్చి నియమించామన్నారు. నంద్యాల, డోన్, ఆత్మకూరు ఆర్డీవో కార్యాలయంలో ఏర్పాటుచేసిన డెస్పాచ్ డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల నుండి పోలింగ్ సామాగ్రిని, పోలింగ్ సిబ్బందిని పోలింగ్ కేంద్రాలకు చేరవేసేందుకు పక్కా ప్రణాళిక రూపొందించామన్నారు. ఇందుకోసం 15 రూట్లను ఏర్పాటు చేసి 34 బస్సులు కేటాయించామన్నారు. అన్ని రూట్లో 15 మంది సెక్టోరల్ అధికారులను ఏర్పాటు చేసి వారికి విస్తృత అధికారాలు కేటాయించి పోలింగ్ ప్రక్రియ నిర్విఘ్నంగా జరిగేలా అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎన్నికల ప్రవర్తన నియామావళి పటిష్టంగా అమలుపరిచేందుకు 29 మండలాల్లో ఎంసీసీ స్క్వాడ్ లను నియమించి నిఘా ఉంచామన్నారు. ప్రతి పోలింగ్ కేంద్ర సమీపంలో మెడికల్ టీం ను కూడా ఏర్పాటు చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఓటర్ స్లిప్పులను 97% ఓటర్లకు పంపిణీ చేసినట్లు కలెక్టర్ తెలిపారు. పోలింగ్ ప్రక్రియ పండుగ వాతావరణంలో ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆయన ఈ సందర్భంగా కోరారు. ఈ సమావేశంలో డిఆర్‌ఓ పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# 10 ఏళ్ల జనసేన..భారీ బహిరంగసభ

(మొదటిపేజీ తరువాయి)

ఉమ్మడి కృష్ణా జిల్లా, గుంటూరు జిల్లాల నుండి ప్రతి నియోజవకర్గం నుండి నాయకులకు సమన్వయకర్తల బాధ్యతలను అప్పగించారు. ఈ మేరకు పార్టీ పబ్లిక్ అకౌంట్స్ కమిటి ఛైర్మన్ నాదెండ్ల మనోహర్ ఇప్పటికే ఆదేశాలు ఇచ్చారు.జనసేన ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని తెలంగాణ ప్రాంతం నుంచి వచ్చే క్యాడర్ కోసం ప్రత్యేకంగా మరో కమిటిని కూడ జనసేన ఏర్పాటు చేసింది. తెలంగాణకు చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలకు ఆహ్వానాలు, ఆతిథ్యం కోసం ఈ కమిటీ పని చేస్తుందని పార్టీ వర్గాలు తెలిపాయిజనసేన పార్టీ 10వ ఆవిర్భావ సభలో వారాహి వాహనం స్పెషల్ అట్రాక్షన్ గా నిలవనుంది. వారాహి వాహనంపై ప్రయాణిస్తూ పవన్ కళ్యాణ్ పార్టీ కేంద్రం కార్యాలయం నుంచి మచిలీపట్టణం సభకు వెళ్ళనున్నారు. ఇప్పటికే తెలుగు రాష్ట్రాల్లో వారాహి వాహనానికి స్పెషల్ క్రేజ్ వచ్చింది. ఎన్నికల ప్రచారం కోసం పవన్ ఇదే వాహనాన్ని వినియోగించనున్నారు. వారాహి వాహనం పై రాజకీయంగా విమర్శలు వచ్చిన క్రమంలో ఎన్నికల ప్రచారానికి ఉపయోగించే వాహనం వారాహిని చూసేందుకు అభిమానులు ఎదురు చూస్తున్నారు. మరోవైపు 14వ తేదీన మంగళగిరి నుంచి విజయవాడ మీదగా మచిలీపట్టణంకు వెళ్ళే రూట్ లో ట్రాఫిక్ డైవర్షన్ పై పోలీసులు చర్యలు చేపట్టారు.

# అధికారం చారిత్రాత్మక అవసరం-రామగోపాల్ రెడ్డిని గెలిపించాలి

## పొలిట్ బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి

**కడప**

తెలుగుదేశం పార్టీ అధికారంలోనికి రావడం చారిత్రాత్మక అవసరమని తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. నగరంలోని గాయత్రీ టవర్స్ లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ టిడిపి పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి గెలుపు ఖాయమని వైకాపా నేతలు భయపడుతూ ఓటర్లను డబ్బుతో ప్రలోభాలు చేస్తున్నారని చెప్పారు. వాలంటరీల ద్వారా దొంగ ఓట్లు వేయించుకునే విధంగా ప్రయత్నాలు చేస్తున్నారని అన్నారు. 20 సంవత్సరాలుగా నిస్వార్థంగా పార్టీలో సేవ చేసిన రామగోపాల్ రెడ్డిని పట్టభద్రులు గెలిపించి తీరుతారని ధీమా వ్యక్తం చేశారు. వైకాపా 4 ఏళ్ల పాలనతో చీకటి ఆంధ్రప్రదేశ్గా మార్చారని మండిపడ్డారు. అన్ని వర్గాల ప్రజలు వైకాపాలనను అసహ్యించుకుంటున్నారని , అధికారంలోకి టిడిపి వస్తే అప్పుల ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి ఆంధ్ర ప్రదేశ్ గా మారుతుందన్నారు. పశ్చిమ రాయలసీమ మేధావులు, ఉద్యోగులు, పట్టభద్రులు రామ్ గోపాల్ రెడ్డి ని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్సీ అభ్యర్థి రామ్ గోపాల్ రెడ్డి మాట్లాడుతూ వైకాపా నాలుగు సంవత్సరాల పాలనలో రాష్ట్రంలో అవినీతి అక్రమాలు పెట్రేగిపోయాయని ఈ ప్రభుత్వ తీరుపై నిప్పులు జరిగారు. నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు, ఉద్యోగులకు సిపిఎస్ సమస్యలు పరిష్కారం పరిష్కారం కావాలంటే టిడిపి అధికారంలోకి రావాల్సిందేనని అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలిచి తీరాలన్న ఉద్దేశంతో జగన్ కోట్లాది రూపాయలు వెచ్చిస్తున్నారని ఆరోపించారు. డబ్బుతో ఓటర్లను ప్రలోభాలు పెట్టిన వైకాపా ఎమ్మెల్సీ అభ్యర్థికి పట్టభద్రులు ఓట్లు వేసే పరిస్థితిలో లేరన్నారు. ఉక్కు పరిశ్రమ కు అతిగతి లేదని, హైకోర్టు ఏర్పాటుపై జగన్ ప్రభుత్వం మోసం చేసిందన్నారు.

# తేజస్వీయాదవ్ కు సీబీసీ సమన్లు

(మొదటిపేజీ తరువాయి)

కూతుళ్ల ఇంట్లోనూ రెయిడ్స్ జరిగాయి. వీరితో పాటు ఆర్‌జేడీ మాజీ ఎమ్మెల్యే అబు దోజన ఇంట్లోనూ సోదాలు చేశారు. ఈ కేసులో లాలూ ప్రసాద్ యాదవ్‌కు ఉచ్చు బిగుసుకుంటోంది. రెండ్రోజుల క్రితమే ఢిల్లీలో ఆయనను విచారించారు సీబీఐ అధికారులు. అటు ఈడీ కూడా వరుసగా సోదాలు చేపడుతూనే ఉంది. బిహార్ ఉప ముఖ్యమంత్రి తేజస్వి యాదవ్ ఇంట్లోనూ సోదాలు చేస్తున్నట్టు సమాచారం. లాలూ హయాంలో ఈ స్కామ్ జరిగినట్టు ఆరోపణలు వస్తున్నాయి. గ్రూప్ డి ఉద్యోగాలు ఇచ్చేందుకు పలు చోట్ల స్థలాలను లంచంగా తీసుకున్నట్టు చెబుతోంది ఈడీ. 2004-09 మధ్య కాలంలో లాలూ ప్రసాద్ యాదవ్ రైల్వే మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. ఆ సమయంలోనే ఈ స్కామ్ జరిగినట్టు ఇఆ అధికారులు ఆరోపిస్తున్నారు. ముంబయి, జబల్‌పూర్, కోల్‌కత్తా, జైపూర్, హాజిపూర్‌లలో పలువురికి గ్రూప్ ఆ పోస్ట్‌లు ఇచ్చారని, అందుకు బదులుగా తమ పేరు మీద స్థలాలు రాయించుకున్నారని చెబుతున్నారు. ఒ . ఆ తరవాత ఈ కంపెనీ ఓనర్‌షిప్‌ను లాలూ ప్రసాద్ యాదవ్ కుటుంబ సభ్యుల పేరుపై మార్చారన్న ఆరోపణలున్నాయి.

# అమరావతి రైలు కనెక్టివిటీ.....మరో ముందడుగు

**ప్రజాతపన ,విజయవాడ:**



అమరావతి.. ఆంధ్రుల కలల రాజధాని. 2015లో అమరావతి నగర నిర్మాణానికి శంకుస్థాపన జరిగింది. ఏపీ రాజధానిని అంతర్జాతీయ నగరంగా తీర్చిదిద్దేందుకు మాస్టర్ ప్లాన్ రూపొందించారు అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు. 217 చ.కి.మీ.ల విస్తీర్ణంలో అన్ని హంగులతో అభివృద్ధి చేయడానికి విజన్ తయారు చేశారు. రైతులను ఒప్పించి 30 వేల ఎకరాలకు పైగా భూ సమీకరణ చేశారు. అమరావతిలో రూ.40 వేల కోట్లకుపైగా అంచనాలతో టెండర్లు పిలిచారు. దాదాపు రూ.10వేల కోట్లు ఖర్చుపెట్టారు.చంద్రబాబు ప్రభుత్వం రూపొందించిన అమరావతి నగర డిజైన్లు ఆహా అనిపించాయి. దేశంలోని ఏ మహానగరానికీ తీసిపోని విధంగా ప్రజారాజధాని అమరావతి వస్తుందని రాష్ట్ర ప్రజలు భావించారు. తమ కలల రాజధాని కల సాకారం అవుతున్న దన్న ఆనందం రాష్ట్ర ప్రజలలో వ్యక్తమైంది. అయితే ఎప్పుడైతే 2019 ఎన్నికల అనంతరం జగన్ సర్కార్ అధికారంలోకి వచ్చిందో.. అప్పటి నుంచి అమరావతి ప్రభ మసకబారింది. అప్పటి వరకూ కళకళలాడిన అమరావతి బోసిపోయింది. జగన్ సర్కార్ అక్కడ కొనసాగుతున్న నిర్మాణాలను ఆపేసింది. జగన్ సర్కార్ తీసుకొచ్చిన మూడు రాజధానుల ప్రతిపాదనతో అమరావతి రాజధాని నిర్మాణం అర్ధాంతరంగా ఆగిపోయింది. భూ సమీకరణ, రూ.10 వేల కోట్లతో చేసిన పనులు.. వేలమంది శ్రామికుల నిరంతర శ్రమ.. నిష్ఫలంగా మిగిలిపోయాయి. రోడ్ల పనులు మధ్యలోనే నిలిచిపోవడంతో.. అవి పూర్తిగా పాడైపోయాయి. రోడ్లను తవ్వి కంకర కూడా దోచుకెళ్లారు దుండగులు. కానీ ఇప్పుడు పరిస్థితి మారుతుందా అన్న పరిస్థితి కనిపిస్తోంది. జగన్ సర్కార్ విశాఖ రాజధాని అంటూ అమరావతికి కనెక్టివిటీకి ప్రతిపాదించిన రైల్వే ప్రాజెక్టులను పట్టించుకో కపోయినా.. ఇప్పుడు రైల్వే శాఖ ఆ ప్రాజెక్టులను సొంతంగానే చేపట్టాలని నిర్ణయించింది. అమరావతి నూతన రైల్వే లైన్ ప్రాజెక్టును తెరపైకి తెచ్చింది. విజయవాడ బైపాస్ రైల్వేలైన్ కింద దీన్ని రైల్వే శాఖ నిర్మించనుంది. తెలుగుదేశం హయాంలో కేంద్ర బడ్జెట్‌లో అమరావతి నూతన రైలు మార్గం సర్వేకు బడ్జెట్ కేటాయించారు. సర్వే ప్రక్రియను కూడా పూర్తిచేశారు. విజయవాడ -గుంటూరులను అమరావతి మీదుగా అనుసంధానంగా చేసేందుకు రూ.2800 కోట్ల అంచనా వ్యయంతో నూతన రైలు మార్గాన్ని ప్రతిపాదించారు. 2017-18 బడ్జెట్‌లో నిధులు కేటాయించారు.జగన్ సర్కార్ అధికారంలోకి వచ్చిన తరువాత మూలన పడిపోయింది. ఇప్పుడు ఏమైందో ఏమో కానీ అమరావతికి కనెక్టివిటీని పెంచేందుకు రైల్వే శాఖ నడుంబిగించింది. అమరావతి విషయంలో కేంద్రం ఇటీవల పార్లమెంటులో, కోర్టుకు ఇచ్చిన నివేదికలో అమరావతికి అనుకూలంగా కేంద్ర స్పందించడం, ఇప్పుడు రైల్వే శాఖ అమరావతి కనెక్టివిటీ విషయంలో అడుగు ముందుకు వేయడంతో రాష్ట్ర ప్రజలలో కొత్త ఆశలు చిగురిస్తున్నాయి. అయితే ఇప్పటికీ జగన్ అమరావతి కాదు అనే అంటున్నారు. ఇటీవల విశాఖ వేదికగా జరిగిన గ్లోబల్ ఇన్వెస్టర్ల సమ్మిట్ వేదికగా త్వరలో తాను విశాఖ నుంచి పాలన సాగించబోతున్నట్లుగా విస్పష్టంగా ప్రకటించారు. ఒక వైపు ఆంధ్రప్రదేశ్ రాజధాని అంశం కోర్టు పరిధిలో ఉండగా జగన్ ఇలా ప్రకటించడంలోని ఔచిత్యమేమిటన్న ప్రశ్న, మరో వైపు జగన్ ఇలా ప్రకటించడం కోర్టు ధిక్కరణ కిందకే వస్తుందన్న వాదన ఉన్నాయి.అయినా వాటిని వేటినీ ఇసుమంతైనా పట్టించుకోకుండా ముఖ్యమంత్రి, మంత్రులు విశాఖ రాజధాని అంటూ ప్రకటనలు గుప్పిస్తున్నారు. ఈ నేపథ్యంలోనూ ఇటీవల పార్లమెంటు వేదికగా వైసీపీ ఎంపీ విజయసాయి ప్రశ్నకు కేంద్ర మంత్రి ఇచ్చిన లిఖితపూర్వక సమాధానంలో ఏపీ రాజధాని అమరావతేనని క్లారిటీ ఇచ్చారు. రాష్ట్ర పునర్విభజన చట్టం ప్రకారమే ఏపీ రాజధానిగా అమరావతిని నిర్ణయించడం జరిగిందనీ, దానిని మార్చాలంటే మళ్లీ పార్లమెంటులో చట్టం చేయాల్సిందేనన్న క్లారిటీ ఇచ్చారు. దీంతో జగన్ చెబుతున్నట్లుగా మూడు రాజధానులు, అమరావతి నుంచే పాలన సాధ్యమయ్యే అవకాశాలు లేవు. కేంద్రం ఇదే విషయాన్ని సర్వోన్నత న్యాయస్థానం దృష్టికి కూడా తీసుకువెళ్లింది. ఈ నేపథ్యంలోనే అమరావతికి రైల్వే కనెక్టివిటీ విషయంలో రైల్వే శాఖ ఒక అడుగు ముందుకు వేయడం శుభపరిణామంగా పరిశీలకులు విశ్లేషిస్తున్నారు.

# రెండేళ్లు తిరుపతి జూలోనే పులిపిల్లలు

**కర్నూలు:**

నంద్యాల జిల్లా కొత్తపల్లి మండలంలోని పెద్దగుమ్మడాపురం గ్రామ శివార్లలో కనిపించిన నాలుగు కూనలను తల్లి దగ్గరకు చేర్చడానికి చేసిన ప్రయత్నాలు ఫలించని సంగతి తెలిసిందే. పులిజాడల్ని గుర్తించి కూనల్ని తల్లి గుర్తించేలా ఎన్‌క్లోజర్‌లో ఉంచినా కూనల చెరువలో పెద్ద పులి రాలేదు. ఫలితంగా అటవీ అధికారులు చేపట్టిన భారీ ఆపరేషన్ ఫెయిల్ అయిపోయింది. అయితే ఆ నాలుగు పులి కూనల్ని తిరుపతి జూకు తరలించిన అధికారులు.... వాటి బాగోగులను చూస్తున్నారు. అయితే ప్రస్తుతం వాటి పరిస్థితి ఏంటి..? ఎన్ని రోజుల తర్వాత అడవిలోకి వదులుతారు..? నాలుగు కూనలు కూడా ఆరోగ్యంగానే ఉన్నాయా..? అనే దానిపై అధికారులు పలు వివరాలను వెల్లడించారు.ప్రస్తుతం నాలుగు పులి కూనలు తిరుపతి శ్రీవేంకటేశ్వర జంతు ప్రదర్శనశాలలో ఉన్నాయి. శుక్రవారమే వీటిని తరలించారు. నిపుణల పర్యవేక్షణలో వాటి సంరక్షణ చర్యలు చేపట్టారు. 50 రోజుల వయసున్న పులి కూనలను వైద్యుల పర్యవేక్షణలో సంరక్షిస్తామని జూ అధికారులు ప్రకటించారు. ప్రస్తుతం ఇక్కడే వాటికి కావాల్సిన ఏర్పాట్లు చేస్తామని పేర్కొన్నారు. పిల్లల వయసు... రెండేళ్లు వచ్చే వరకు జూలోనే ఉంటాయని వెల్లడించారు. స్వతహాగా వేటాడే స్థితికి చేరుకునే వరకు జూలోనే సంరక్షిస్తామని చెప్పారు. నాలుగు పులి పిల్లల్లో... మూడు పూర్తిస్థాయిలో ఆరోగ్యంగా ఉన్నాయన్నారు. ఇందులో ఒకదాని పరిస్థితి నీరసంగా ఉందని.. వైద్యసేవలు కొనసాగుతున్నాయని ప్రకటించారు.దొరికిన నాలుగు పులి పిల్లలను తల్లి వద్దకు చేర్చేందుకు అటవీ అధికారులు తీవ్ర ప్రయత్నాలు చేశారు. సోమవారం పులి కూనలు దొరికిన తర్వాత తల్లి పులి అచూకీ కోసం అటవీశాఖ విస్తృతంగా గాలింపు చేపట్టింది. బుధవారం సాయంత్రం రోడ్డు దాటుతున్న పులిని గొర్రెల కాపరి గుర్తించాడు. మరో ఆటో డ్రైవర్ కూడా దానిని చూడటంతో అటవీ అధికారులకు సమాచారం ఇచ్చాడు. కూనలు దొరికిన పరిసర ప్రాంతాల్లోనే తిరుగుడుండటంతో అధికారులు సంబర పడ్డారు. పులి జాడ తెలియడంతో బుధవారం అర్ధరాత్రి పెద్దగుమ్మడాపురం సమీపంలోని అటవీ ప్రాంతానికి పిల్లలను తీసుకెళ్లిన అధికారులు ఎన్‌క్లోజరులో వాటిని ఉంచి నిరీక్షించారు. ఆరు బయట ప్రదేశం కావడం, పులి పిల్లలు భయపడుతుండటంతో అర్ధరాత్రి దాటిన తర్వాత బైర్లూటిలోని అటవీశాఖ అతిథి గృహానికి తీసుకొచ్చేశారు.రాత్రంతా పులి సంచరించిన ప్రాంతాల్లో కూనలను ఉంచి, కృత్రిమ శబ్దాలు చేస్తూ తల్లి పులి జాడ కోసం వెతికారు. మిగతా ప్రాంతాల్లో ట్రాప్ కెమెరా, ప్లగ్ మార్క్ ఆధారాలు సేకరించే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. ఇవేమి తల్లి పులి దృష్టిని ఆకర్షించలేదని అధికారలు వివరించారు. పులి జాడలు దొరకడంతో కూనల కథ సుఖాంతం అయ్యినట్లు భావించినా చివరకు నిరాశ తప్పలేదు.50 మందికిపైగా అటవీ అధికారులతో మొత్తం? 300 మంది సిబ్బందితో ఆపరేషన్ మదర్ టైగర్ కోసం వినియోగించినట్లు తెలిపారు. పులి అన్వేషణ కోసం ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించినట్లు వెల్లడించారు. దాదాపు 200 హెక్టార్లలో 40 ట్రాప్ కెమెరాలను ఏర్పాటు చేశారు. నిపుణుల సూచనల మేరకు పులికూనలకు పాలు, సెరోలాక్ తో పాటు ఉడికించిన చికెన్ లివర్ ముక్కలను అందించారు. చివరిక ఆపేరషన్ ఫెయిల్ కావటంతోనే తిరుపతి జూకు తరలించారు.

# లిక్కర్ స్కామ్... మూలాలు హైదరాబాద్ లోనే

**హైదరాబాద్:**



దిల్లీ లిక్కర్ స్కామ్ లో అరెస్టైన ఆప్ నేత మనీశ్ సిసోడియాను ఈడీ కోర్టులో హాజరు పర్చింది. అయితే సిసోడియా రిమాండ్ రిపోర్టులో ఈడీ సంచలనాలు బయటపెట్టింది. హైదరాబాద్ కేంద్రంగానే దిల్లీ లిక్కర్ స్కామ్ జరిగిందని తెలిపింది. కొంతమంది వ్యక్తులకు ప్రయోజనం చేకూర్చేలా నిపుణుల కమిటీ అభిప్రాయాలను అంగీకరించకుండా ఈ మద్యం విధానాన్ని రూపొందించారని ఈడీ కోర్టుకు తెలిపింది. ఈ కేసులో ఆప్ సీనియర్ నేత సిసోడియాకు వ్యతిరేకంగా తమ వద్ద ఆధారాలు ఉన్నాయని ఈడీ న్యాయవాది తెలిపారు. ఈ విధానంలో తాము ఎంపిక చేసిన హోల్‌సేల్ వ్యాపారులు 12 శాతం ప్రాఫిట్ మార్జిన్ వచ్చే విధంగా పాలసీని రూపొందించినట్లు ఈడీ తెలిపింది. ఇది ఉండాల్సిన దానికంటే ఆరు శాతం ఎక్కువ ఉందని వెల్లడించింది."మనీశ్ సిసోడియా ఆదేశాల ప్రకారమే ఇది జరిగిందని మా వద్ద సమాచారం ఉంది. మద్యం అమ్మకానికి లైసెన్స్ ఇవ్వడానికి నిర్ణయించిన వ్యవస్థను కూడా ఉల్లంఘించారు. కొంతమంది ఎంపిక చేసిన వ్యక్తులు దాని నుంచి ప్రయోజనం పొందారు" అని ఇఆ తెలిపింది. తెలంగాణ ఎమ్మెల్సీ కె.కవితతో సహా సౌత్ గ్రూప్‌తో పాటు సిసోడియా సహాయకుడు విజయ్ నాయర్ మొత్తం కుట్రను సమన్వయం చేశారు, వ్యాపారవేత్త దినేష్ అరోరా కిక్‌బ్యాక్‌లను సమన్వయం చేస్తున్నారని ఈడీ కోర్టుకు తెలిపింది. దిల్లీలోని ఎక్సైజ్ వ్యాపారంలో సౌత్ గ్రూప్ వాటాదారుగా మారిందని ఈడీ పేర్కొంది. కవిత మాజీ ఆడిటర్ గోరంట్ల బుచ్చిబాబు చెప్పిన ఆధారాలను ఈడీ రిమాండ్ రిపోర్టులో స్పష్టంచేసింది. సిసోడియా, కేసీఆర్ కుమార్తె కవిత మధ్య రాజకీయ అవగాహన ఉందని, ఆమె విజయ్ నాయర్‌ను కూడా కలిశారని ఈడీ వెల్లడించింది. ఇఆ న్యాయవాది వాదనలను సిసోడియా తరపు న్యాయవాదులు -- సీనియర్ న్యాయవాదులు దయన్ కృష్ణన్, మోహిత్ మాథుర్, సిద్ధార్థ్ అగర్వాల్ తిరస్కరించారు. ఎక్సైజ్ పాలసీని లెఫ్టినెంట్ గవర్నర్ ఆమోదించారని, ఆయన ఆమోదం తెలిపే ముందు తప్పనిసరిగా పరిశీలించి ఉంటారని సిసోడియా తరపు న్యాయవాదులు తెలిపారు. సిసోడియా తరపు న్యాయవాది మాట్లాడుతూ ఈడీ... వాదనలు చెడు ఉద్దేశంతో ఉన్నాయని అన్నారు. ఈ కేసులో గరిష్ఠ శిక్ష ఏడేళ్లు మాత్రమేనని, అందుకే బెయిల్ ఇవ్వాలని కస్టడీ విధించవద్దని కోరారు. ఈ రోజుల్లో ఏజెన్సీలు అరెస్టులను హక్కుగా తీసుకోవడం ఫ్యాషన్‌గా మారిందని, ఈ హక్కుపై కోర్టులు ప్రశ్నించాల్సిన సమయం ఆసన్నమైందని సిసోడియా తరపు న్యాయవాది దయన్ కృష్ణ కోర్టులో పేర్కొన్నారు. సీబీఐ ఈ కేసులో దర్యాప్తు చేస్తోంది. ఈడీ చెబుతున్న కేసు వాస్తవానికి సీబీఐ కేసు అని, మనీలాండరింగ్ నిరోధక చట్టం కింద ఈడీ దర్యాప్తు చేస్తుందని కృష్ణ అన్నారు. దిల్లీ లిక్కర్ స్కామ్ లో సంచలనాలు వెలుగులోకి వస్తున్నాయి. హైదరాబాద్ కేంద్రంగానే లిక్కర్ స్కామ్ జరిగిందని మనీశ్ సిసోడియా రిమాండ్ రిపోర్టులో ఈడీ పేర్కొంది దిల్లీ కోర్టులో ఆప్ నేత సిసోడియాను ఈడీ అధికారులు హాజరుపరిచారు. సిసోడియా రిమాండ్ రిపోర్టులో రాజకీయ, ఆర్థిక, నేరపూరిత వ్యవహారాలను ఈడీ బయటపెట్టడింది. లిక్కర్ స్కామ్ హైదరాబాద్ లోనే ప్లాన్ చేశారని తెలిపింది. దినేష్ అరోరాను సౌత్ గ్రూప్ హైదరాబాద్‌కు పిలిపించిందని, ఐటీసీ కోహినూర్‌లోనే కీలక చర్చలు జరిగాయని ఈడీ రిపోర్టులో పేర్కొంది. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితకు, దిల్లీ సీఎం కేజ్రీవాల్, అప్పటి డిప్యూటీ సీఎం మనీశ్ సిసోడియాకు ఈ విషయం తెలుసని, కవిత మాజీ ఆడిటర్ బుచ్చిబాబు చెప్పారని ఈడీ రిమాండ్ రిపోర్టులో వెల్లడించింది. 2021 మార్చి 19, 20 తేదీల్లో విజయ్‌నాయర్‌ని ఎమ్మెల్సీ కవిత కలిశారు. కేజ్రీవాల్, సిసోదియా తరఫున విజయ్‌నాయర్ పనిచేశారని బుచ్చిబాబు తెలిపారని ఈడీ రిపోర్టులో చెప్పింది. ఇండోస్పిరిట్ కంపెనీలో 32 శాతం వాటాను అరుణ్ పిళ్లై పేరుతో కవిత కలిగి ఉన్నారని, కవితకు అనుకూలంగా లిక్కర్ పాలసీలో మార్పులు చేస్తే కొంత అమౌంట్ ఆప్‌కు ఇచ్చేందుకు అవగాహన కుదిరిందన్నారు. ఈ విషయాన్ని బుచ్చిబాబు తన వాంగ్మూలంలో తెలిపారని ఈడీ వెల్లడించింది. 2021 జూన్‌లో హైదరాబాద్‌లోని ఐటీసీ కోహినూర్ హోటల్లో అరుణ్ పిళ్లై, అభిషేక్ బోయినపల్లి, విజయ్ నాయర్, దినేశ్ అరోరా భేటీ అయ్యారని చెప్పింది. రూ.100 కోట్ల ముడుపులు ఎలా ఇవ్వాలి, ఎలా దిల్లీకి తరలించాలనే అంశాలపై చర్చించారని ఈడీ రిమాండ్ రిపోర్టులో తెలిపింది. సౌత్ గ్రూప్ ద్వారా దినేష్ అరోరా రూ.31 కోట్ల నగదు తీసుకుని, ఆ నగదును ఆప్ నేతలకు చేరవేశారు. దిల్లీ మద్యం పాలసీ రూపకల్పన సమయంలో సిసోడియా 14 మొబైల్ ఫోన్లు మార్చారు. సీబీఐ దాడుల్లో వాటిలో రెండు ఫోన్లు స్వాధీనం చేసుకున్నారని ఈడీ తన రిపోర్టులో వెల్లడించింది. దిల్లీ లిక్కర్ పాలసీ అధికారికంగా విడుదల చేయడానికి రెండు రోజుల ముందే కవిత మాజీ ఆడిటర్ బుచ్చిబాబుకి ఆ వివరాలు చేరాయని తెలిపింది. మద్యం విధానంలో కొన్ని విషయాలను బుచ్చిబాబు ఫోన్ లో గుర్తించామని ఈడీ కోర్టుకు తెలిపింది. మద్యం పాలసీలో 12 శాతం ప్రాఫిట్ ఉండేలా మార్చి దానిలో ఆప్ నేతలకు 6 శాతం అందించాలని విజయ్ నాయర్ చెప్పినట్టు దినేష్ అరోరా ఈడీ ముందు ఒప్పుకున్నారని రిమాండ్ రిపోర్టులో పేర్కొంది. లిక్కర్ పాలసీపై దిల్లీ ఎల్జీ విచారణ చేపట్టాలని ఆదేశించిన రోజే సిసోడియా ఫోన్ మార్చారని ఈడీ తెలిపింది. ఇతరుల పేర్లతో సిమ్ కార్డులు వినియోగించారని, ముడుపుల ద్వారా రూ.100కోట్లు, ఇండోస్పిరిట్స్ లాభాల్లో రూ.192 కోట్లు అందాయని ఈడీ తెలిపింది. ముడుపుల విషయంలో సిసోడియా పొంతనలేని సమాధానాలు ఇచ్చారని, రూ.292.8 కోట్లు దక్కిన వ్యవహారంలో సిసోడియా కీలకమని ఈడీ రిమాండ్ రిపోర్టులో స్పష్టం చేసింది.

# బెల్టు షాపులతో బెంబేలెత్తుతున్న జనం

**-వీధి వీధికో బెల్టు షాప్**

**-మత్తులో జోగుతున్న యువత**

**మంథని**

మంథని పట్టణ ప్రాంతంతో పాటు గ్రామాల్లో బెల్ట్ షాపుల ద్వారా మద్యం ఏరులై పారుతుంది. చాప కింద నీరు వలే యువత భవిష్యత్తు మత్తులోకి వెళుతుంది. వీధి వీధికో బెల్ట్ షాపు ఏర్పాటు చేయడంతో భవిష్యత్తు భావి యువత జీవితం అంధకారంలోకి వెళ్తుంది. పోటీపడి మరి బెల్ షాపులు ప్రారంభించడం జరుగుతున్నది. గ్రామాల్లో బహిరంగంగా వేలం పాట ద్వారా బెల్ట్ షాపులు చేజిక్కించుకున్న బెల్ట్ షాపుల యజమానులు మద్యం ప్రియుల నుండి అందిన కాడికి దోచుకుంటున్నారు. బెల్ట్ షాపులలో అధిక ధరకు మద్యం అమ్మడం, వంటి కార్యక్రమాలు గ్రామీణంలో కోకోల్లోలుగా జరుగుతున్నప్పటికీ పట్టించుకునే నాధుడే కరువయ్యాడు. బెల్ట్ షాపులపై కొరడా జులుపించాల్సిన అధికారులు చూసి చూడనట్లు వ్యవహరించడంతో గ్రామాలలో బెల్ట్ షాపులు రాజ్యమేలుతున్నాయి. అధిక ధరకు మద్యం విక్రయించడం ద్వారా అప్పుచేసి మరి యువత మద్యం కొనుగోలు చేయడం ద్వారా, యువత మానసికంగా ఆర్థికంగా చాలా ఇబ్బందుల పాలవుతున్నారు. పొద్దు మాపు, పగలు రాత్రి , అనే తేడా లేకుండా 24 గంటలు బెల్ట్ షాపులు నడవడం వల్ల బెల్టు షాపులలో మద్యం లభించడంతో గ్రామాలలో వేకువ జాముననే మద్యం కోడై కూస్తుంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు మేలుకొని బెల్టు షాపుల పై చర్యలు తీసుకోవాల్సిందిగా సగటు యువత కోరుతుంది. మంథని పట్టణంలోని పలు మద్యం షాపుల్లో కల్తీ మద్యం విక్రయిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి అంతేకాకుండా మద్యం వ్యాపారులు ఎమ్మార్పీ ధరకు మద్యం విక్రయించకుండా అధిక ధరలు వసూలు చేస్తు న్నారని ఆరోపణలు ఉన్నాయి ఉన్నతాధి, కారులు ఇప్పటికైనా స్పందించి నకిలీ మద్యం విక్రయా లపై విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# అధికారంలో కొనసాగే అర్హత కేసీకు లేదు

**మెట్ పల్లి**



మెట్ పల్లిలో పసుపు మార్కెట్ ను టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి శనివారం సందర్శించారు. తరువాత అయన మాట్లాడుతూ హర్యానా మాదిరిగా ఇక్కడి రైతులు లాభసాటి పంటలు పండిస్తారు. పదిమందికి పని కల్పించి, పట్టెడన్నం పెట్టి ఆదుకుంటున్నారు ఇక్కడి రైతులు. గోదావరి జిల్లాల కంటే ఈ ప్రాంత రైతులు శ్రీమంతులని అన్నారు. తెలంగాణ ఉద్యమంలో రైతులు కీలక పాత్ర పోషించారు. షుగర్ ఫ్యాక్టరీ ఉమ్మడి రాష్ట్రంలో మూత పడలేదు. కేసీఆర్ అధికారంలోకి వచ్చిన మరుక్షణం షుగర్ ఫ్యాక్టరీని మూసేశారు. ఆత్మ గౌరవంతో బతికే రైతులను ఆత్మహత్య చేసుకునే పరిస్థితికి తెచ్చారు. ఈ ప్రాంతంలో పర్యటించిన కవిత 100 రోజుల్లో ఫ్యాక్టరీని తెరిపిస్తామన్నారు. చక్కెర కర్మాగారం ముగిసిన అధ్యాయమని కేసీఆర్ అసెంబ్లీలో ప్రకటించారు. మా ఆత్మగౌరవం ముగిసిన అధ్యాయమైతే... తెలంగాణలో కేసీఆర్ అధికారం కూడా ముగిసిన అధ్యాయమే అవుతుంది. 3లక్షల కోట్లు బడ్జెట్ ఉన్న రాష్ట్రంలో చక్కెర కర్మాగారాన్ని నడపలేరా ? చక్కెర కర్మాగారాన్ని కూడా నడిపించలేని కేసీఆర్ రాష్ట్రాన్ని నడపలేరు. కేసీఆర్ కు ఇక ఒక్క నిమిషం కూడా అధికారంలో కొనసాగే అర్హత లేదు. పసుపు బోర్డు తెస్తానన్న వ్యక్తి శంకరగిరి మాన్యాలు తిరుగుతుండు. ఈ ప్రభుత్వం ఏ పంటకు గిట్టుబాటు ధర కల్పించడం లేదు. వరి వేస్తే ఉరే అని ప్రకటించిండు. కేసీఆర్ చెబుతున్న అబ్ కీ బార్ కిసాన్ సర్కార్ ఇదేనా? తెలంగాణను సీడ్ బౌల్ అని చెప్పిన కేసీఆర్.. ఇప్పుడు పరిశ్రమలను మూసేస్తున్నారు. తెలంగాణలో వ్యవసాయాన్ని చంపేయాలని కేసీఆర్ కుట్ర చేస్తున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఆరు నెలల్లో చక్కెర కర్మాగారాన్ని తెరిపిస్తాం. కేసీఆర్ పై కోపంతో బీజేపీ వైపు వెళ్లొద్దు అన్నారు. బీజేపీ వైపు చూస్తే పెనం మీద నుంచి పొయ్యిలో పడ్డట్టే. 10 లక్షల ఎకరాల చెరుకు రైతులను ఆదుకునే ఫ్యాక్టరీని ఎందుకు తెరవరు. రైతుల కోసం 0.1 శాతం నిధులు కేటాయించలేరా? కేసీఆర్ అధికార మదాన్ని అణచివేయాలి. రైతు వ్యతిరేక నల్ల చట్టాలపై పోరాడి చట్టాలను మోడీ వెనక్కు తీసుకునేలా చేసిన ఘనత రైతులది. మోదీ మెడలు వంచిన హర్యానా రైతుల స్ఫూర్తితో మీరంతా ఏకం కండి. మీరు రాజకీయ పార్టీల చుట్టూ తిరగనవసరం లేదు. ఏకమై పోరాడితే...మీ వెంటే రాజకీయ పార్టీలు వస్తాయని అన్నారు.

# 3వసారి అధ్యక్షుడిగా జిన్ పింగ్

**బీజింగ్:**

చైనా అధ్యక్షుడిగా వరుసగా మూడోసారి ఎన్నికయ్యారు షి జిన్‌పింగ్. దేశ చరిత్రలో అత్యంత శక్తివంతమైన నాయకుడిగా ఎదిగిన ఆయన మరోసారి చైనా అధ్యక్ష పీఠాన్ని అధిష్టించారు. చైనా 'రబ్బర్ స్టాంప్' పార్లమెంటు.. షి జిన్‌పింగ్‌ను శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకుంది. గతేడాది అక్టోబర్‌లో చైనీస్ కమ్యూనిస్ట్ పార్టీ జనరల్ సెక్రటరీగా మరో ఐదేళ్లు ఎంపికైనప్పుడే.. అధ్యక్షుడిగా మూడోసారి జిన్‌పింగ్ ఎంపిక లాంఛనమైంది. దీనికి పార్లమెంట్ ఇప్పుడు ఆమోదం తెలిపింది.నేషనల్ పీపుల్స్ కాంగ్రెస్ లోని 2,952 మంది ప్రతినిధులు షి జిన్‌పింగ్‌కు మద్దతుగా ఓటేశారు. దీంతో ఎలాంటి ఎదురులేకుండా మూడోసారి అధ్యక్ష పదవి చేపట్టారు జిన్‌పింగ్. తన తిరుగులేని ఆధిపత్యాన్ని మరోసారి చాటుకున్నారు. చైనా అధ్యక్షుడికి దేశంలో విశేష అధికారాలు ఉంటాయి. సెంట్రల్ మిలటరీ కమిషన్ చైర్మన్‌గానూ ఉంటారు.చైనా అధ్యక్షుడిగా రెండు హయాంలు మాత్రమే ఉండాలని, 10 సంవత్సరాల తర్వాత వేరే వారికి అధికారం ఇవ్వాలనే నిబంధన 1982 నుంచి చైనాలో ఉండేది. అయితే 2018లో ఆ రూల్‌ను షి జిన్‌పింగ్ తొలగించారు. ఈ నిర్ణయానికి కూడా అప్పట్లో చైనా పార్లమెంటు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. దీంతో జిన్‌పింగ్ ఎంతకాలమైనా అధ్యక్షుడిగా కొనసాగే అవకాశం వచ్చింది. ఇప్పుడు వరుసగా మూడోసారి ఆయన అధికారం చేపట్టారు. 2013లో తొలిసారి ఆయన చైనా అధ్యక్ష పదవిని చేపట్టారు.కరోనా వైరస్ విలయం నుంచి చైనా ఇప్పుడిప్పుడే కోలుకుంటున్నట్టు కనిపిస్తోంది. అయితే ఆ దేశంలో వృద్ధి ప్రస్తుతం తగ్గుతోంది. ప్రపంచంలో రెండో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉన్న చైనా తిరోగమన దిశగా పయనిస్తున్నట్టు కనిపిస్తోంది. రియల్ ఎస్టేట్ సెక్టార్ సంక్షోభంలో ఉంది. జననాల రేటు కూడా ఆందోళనకరంగా తగ్గుతోంది. అమెరికాతో సంబంధాలు నానాటికీ క్షీణిస్తున్నాయి. ఉద్రిక్తతలు పెరుగుతున్నాయి. సరిహద్దు దేశాలతో జగడాలు కొనసాగుతున్నాయి. ఇలా జిన్‌పింగ్ ముంగిట చాలా సవాళ్లు ఉన్నాయి.జీరో-కొవిడ్ పాలసీని అమలు చేయటంతో గతేడాది షి జిన్‌పింగ్ ప్రభుత్వంపై చైనా ప్రజలు తిరగబడ్డారు. జీరో-కొవిడ్ పాలసీని రద్దు చేయాలంటూ ఉద్ధృతంగా ఉద్యమాలు చేశారు. చైనాలో ఎన్నడూ లేని విధంగా ప్రభుత్వ వ్యతిరేక ఆందోళనలు జరిగాయి. అయితే కొంతకాలానికి జీరో-కొవిడ్ పాలసీని జిన్‌పింగ్ సర్కార్ ఎత్తేసింది. అనంతరం కొవిడ్ మరణాలు చైనాలో కొద్దికాలం ఎక్కువగా నమోదయ్యాయి.

# ఎంపీ వెంకట్ రెడ్డి పై చెరుకు సుధాకర్ ఫిర్యాదు

**హైదరాబాద్ :**

ఎంపీ కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పై కాంగ్రెస్ ఇంచార్జీ మాణిక్‌రావ్ థాక్రే కు కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు చెరుకు సుధాకర్ ఫిర్యాదు చేశారు. తనని చంపుతానంటూ ఎంపీ కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై చర్యలు తీసుకోవాలని కోరారు. వెంకట్ రెడ్డిని పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని కోరారు. అనంతరం చెరుకు సుధాకర్ మీడియాతో మాట్లాడుతూ.. భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకటరెడ్డి తన కొడుకుకు ఫోన్ చేసి బెదిరించారని తెలిపారు. తన కొడుకుకు ఫోన్ చేసి బూతుపదాలతో దూషించి చంపుతామని బెదిరించారన్నారు. "మాణిక్‌రావు థాక్రేకు ఫిర్యాదు చేశాను. ఈ అంశం ఏఐసీసీ పరిధిలోకి వెళ్లింది కనుక ఇక ఏమీ మాట్లాడను. పార్టీకి నష్టం చేసే చర్యలు చేయను. క్షమాపణలు చెప్పాలని కూడా అడగను. ఆయన వల్ల మునుగోడులో పార్టీకి నష్టం జరిగినా, పశ్చాత్తాపం వ్యక్తం చేయలేదు. వెంకట్ రెడ్డి క్షమాపణ చెప్పాలని నేను అడగలేదు. ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని పార్టీని కోరాం. బడుగు, బలహీన వర్గాలకు పార్టీ అండగా ఉంటుంది. కోమటిరెడ్డికి బెదిరింపు ఫోన్లు ఎవరు చేస్తున్నారో తెల్వదు. నల్లగొండలో మేము ఫిర్యాదు చేస్తే ఎలాంటి చర్యలు లేవు. సోషల్ మీడియాలో ఎవరో ఏదో కామెంట్స్ చేశారని కార్యకర్తలను రోజంతా పోలీస్ స్టేషన్లో పెట్టారు. కోమటిరెడ్డికి బెదిరింపు కాల్స్ చేసేవాళ్ళపై చర్యలు తీసుకోవాలి" అంటూ చెరుకు సుధాకర్ డిమాండ్ చేశారు.

# వైకాపా ఎమ్మెల్సీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించండి

**ఓటర్లను కోరిన ఆడ చైర్మన్ సింగ సాని**

**గురు మోహన్**

**బద్వేలు**

వైయస్సార్సీపి అభ్యర్థులుగా పోటీ చేస్తున్న వెన్నపూస రవీంద్రారెడ్డి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి రామచంద్రారెడ్డిల కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి వారికి మద్దతు ఇవ్వాలని ఆడా చైర్మన్ సింగ సాని గురు మోహన్ ఓటర్లకు విజ్ఞప్తి చేశారు ముఖ్యంగా పట్టబద్రులు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఆయన కోరారు వైకాపా ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపిస్తే ప్రభుత్వానికి సంపూర్ణ మద్దతు ఇచ్చినట్లుగానే భావించాలని తెలిపారు వైయస్ జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత రాజకీయాలకు అతీతంగా ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తున్న విషయాన్ని గుర్తు చేశారు గతంలో ఏ ప్రభుత్వం కూడా ఇప్పుడు అమలవుతున్న పథకాలు ప్రవేశ పెట్టలేదని అన్నారు ఈనెల 13వ తేదీ జరుగుతున్న ఎమ్మెల్సీ ఎన్నికలు 2024 సార్వత్రిక ఎన్నికలకు రెఫరాండంగా భావించి ఎమ్మెల్సీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు ఇతర ప్రాంతాల్లో ఉన్న స్థానిక ఓటర్లను రప్పించి వారిచేత ఓట్లు వేయించాలని కోరారు ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడమే కాక నాడు నేడు పేరుతో పాఠశాలల రూపురేఖలు మార్చి విద్యాభివృద్ధికి కృషి చేస్తున్నారని గురు మోహన్ అన్నారు ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి బలపరిచిన ఇరువురు అభ్యర్థులకు ఓట్లు వేసి గెలిపించాలని ఆయన కోరారు శాసనమండలిలో ప్రశ్నించే వారికి ఓట్లు వెయ్యాలని ఆయన కోరారు వైకాపా ఇరువురు అభ్యర్థులకు ఆ అర్హత ఉందని ఆయన తెలిపారు పార్టీ విజయానికి నాయకులు కార్యకర్తలు కృషి చేయాలని ఆయన కోరారు ప్రతి ఇంటికి వెళ్లి పట్ట బద్రులు ఉపాధ్యాయులు కలిసి ఓట్లు అడగాలని ఆయన కోరారు 100% ఓటర్లు ఓటింగ్లో పాల్గొనేలా చూడాలని అన్నారు, పోలైన ఓట్లలో 85% వైకాపా అభ్యర్థులకు ఓటు పడేలా చూడాలని గురు మోహన్ విజ్ఞప్తి చేశారు

# లంకమల అభయారణ్యంలో కూంబింగ్

**సిద్దవటం**

లంకమల అభయారణ్యంలోని సిద్దవటం రేంజ్ రోళ్లబోడు, సిద్దవటం బీటుల్లో రెండు బృందాలు గాలింపు చర్యలు చేపట్టి 26 ఎర్రచందనం దుంగలను పట్టుకున్నట్లు సిద్దవటం రేంజర్ ప్రసాద్ తెలిపారు. మండలకేంద్రమైన సిద్దవటం అటవీశాఖ కార్యాలయంలో పట్టుబడిన ఎర్రచందనానికి సంబందించిన వివరాలను శనివారం ఆయన విలేఖరుల సమావేశంలో వెల్లడించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ లంకమల అభయారణ్యంలోని రోళ్లబోడు బీటులో, సిద్దవటం టౌన్ బీటుల్లో శు క్రవారం సాయంత్రం రెండు బృందాలు కూంబింగ్ నిర్వహించాయన్నారు. కూంబింగ్ లో భాగంగా రోళ్లబోడు బీటులో 12 ఎర్రచందనం దుంగలు, సిద్దవటం టౌన్ బీటులో 14



ఎర్రచందనం దుంగలను పట్టుకోవడం జరిగిందన్నారు. ఈ మేరకు ఎర్రచందనం దుంగలను నరకిన వారి కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేసినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ రేంజర్ ఓబులేసు, ఫారెస్ట్ బీటు అధికారులు రాజశేఖర్ రెడ్డి, విశ్వనాథ్, హైమావతి, అటవీశాఖ సిబ్బంది, ప్రొటెక్షన్ వాచర్లు, తదితరులు పాల్గొన్నారు

# పగలు ధవళవర్ణం! రాత్రిళ్లు సప్తవర్ణం

**హైదరాబాద్:**

ఇటు చూస్తే నింగికి బాహువులు చాపినట్టుగా అంబేద్కర్ విగ్రహం! ఎదురుగా అఖండ జ్యోతి వెలుగుతున్నట్టుగా తెలంగాణ అమరు వీరుల స్మారకచిహ్నం! తలపక్కకి తిప్పితే తథాగథుడి మౌనముద్ర చుట్టూ అపార జలరాశి- హుస్సేన్ సాగర్! మధ్యలో నీటిని వయ్యారంగా ఆకాశానికి ఎగజిమ్మే ఫౌంటెయిన్! దూరంగా జాతీయజెండా రెపరెపలు! ఆధునిక పాలనా దేవాలయంగా అభివర్ణించే నూతన సచివాలయం- నభూతో నభవిష్యతి! ఎక్కడా రాజీపడలేదు! ఏ విషయంలోనూ వెనక్కి తగ్గలేదు! వందేళ్ల విజన్ తో నిర్మించిన సెక్రటేరియట్ ప్రత్యేకతలు- మచ్చుకు కొన్ని చూద్దాం!పగలు ధవళవర్ణం! రాత్రిళ్లు సప్తవర్ణం! సచివాలయం ప్రాంగణంలో నీళ్లుచిమ్మే ఫౌంటెయిన్ స్పెషాలిటీ అదే! పచ్చటి తివాచీ పరిచినట్టుగా గ్రీన్ లాన్ కనువిందు చేస్తుంది! గుమ్మటాలు గతకాలపు చారిత్రక నేపథ్యానికి అద్దం పడుతున్నట్టుగా ఉంటాయి! స్టోన్ డిజైన్ వర్క్ అదనపు హంగు! సెక్రటేరియట్ ప్రధాన ద్వారం అత్యంత విశాలంగా ఉంటుంది. ఆ దర్వాజని భోపాల్ నుంచి ప్రత్యేకంగా వుడ్ కార్వింగ్ చేసి తెప్పించారు! సీఎం కేసీఆర్ లక్కీ నెంబర్ ఆరు! సచివాలయంలో సీఎం ఛాంబర్ కూడా ఆరో అంతస్తులో ఉంటుంది! అక్కడ ఫర్నిచర్ గురించి ప్రత్యేకంగా చెప్పుకోవాలి! వాల్ క్లాడింగ్, డెకరేషన్ వేరే లెవల్లో ఉంటాయి! ఎటు చూసినా రాయల్ లుక్! తెల్లటి రంగుతో కూడిన గోల్డ్ కలర్ పట్టీలతో తీర్చిదిద్దిన గోడలు! గోడల రంగుతో సరిపోయే విధంగా మార్బుల్ ఫ్లోరింగ్, విశాలమైన కారిడార్లు! అంతే అందంగా తీర్చిదిద్దిన ఛాంబర్ల డోర్స్.. ఇలా దేనికదే ప్రత్యేకం! సీఎం ఛాంబర్ లోని సమావేశ



మందిరంలోకి ప్రవేశించగానే మరోలోకంలో అడుగుపెట్టినట్టుగా ఉంటుంది! అందులో ఫర్నిచర్ సింప్లీ సూపర్బ్!ఇక, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి సెపరేట్ ఛాంబర్! ఆ సిబ్బంది కోసం ఆఫీసులు. కాన్ఫరెన్స్ హాల్, సందర్శకుల కోసం వెయిటింగ్ హాల్! అందులో ఏసీ నుంచి వైఫై వరకు సకల సౌకర్యాలు! డైనింగ్ తదితర అవసరాలకోసం మల్టీ పర్సస్ గా వాడుకోవడానికి విశాలంగా ఉంటుంది! జీఏడీ ప్రోటోకాల్ సిబ్బంది కోసం ప్రత్యేక ఛాంబర్. కలెక్టర్ల కాన్ఫరెన్స్ హాల్, ప్రజాప్రతినిధుల కోసం వెయిటింగ్ లాంజ్, వీఐపీల వెయిటింగ్ లాంజ్! మంత్రులకు కేటాయించిన శాఖలు అన్నీ ఒకేదగ్గర వుండే విధంగా డిజైన్ చేశారు. ఆయా శాఖలల్లో పనిచేస్తున్న ఉద్యోగుల సంఖ్యకు అనుకూలంగా కార్యాలయాలు. సచివాలయం దక్షిణ భాగంలో పార్కింగ్ సదుపాయం. ప్రహారీకి అంతర్గతంగా, బయట పక్కా రోడ్లు! ఇటు వైపు వస్తే దేశంలోనే అతిపెద్దదైన 125 అడుగుల అంబేద్కర్ విగ్రహం! స్టాచ్యూ అడుగు భాగాన విశాలమైన హాల్స్! ఆడియో విజువల్ ప్రదర్శనకోసం ఆడిటోరియం! బయట ఫౌంటెయిన్, లాండ్ స్కేపింగ్! ఇటొస్తే అమరవీరుల జ్యోతి! 365 రోజులు వెలిగే అఖండదీపం మెయిన్ కాన్సెప్ట్! మొదటి అంతస్తులో ఆడియో, వీడియో ప్రదర్శనల కోసం ఆడిటోరియం! లేజర్ షో, ర్యాంప్, సెల్లార్ పార్కింగ్ తదితర సదుపాయాలు ఉంటాయి.ప్రపంచం మెచ్చేలా తీర్చి దిద్దుతున్న ఈ సచివాలయాన్ని ఏప్రిల్‌లో ప్రారంభించాలని సీఎం కేసీఆర్ సంకల్పించారు. అందుకు తగ్గట్టుగానే పనులు వేగవంతం చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

# ఈ పెట్టి కేసు ద్వారా నేర ప్రవృత్తిని తగ్గించవచ్చు

**సాక్షాదారాలతో శిక్షలు పడేలా పకడ్బందీ చర్యలు**

**పెట్టి కేసు బుక్ అయిన పాస్ పోర్ట్ రాదు, ప్రభుత్వ ,ప్రైవేట్ ఉద్యోగులకు అనర్హులు**

**జిల్లాలో ఫిబ్రవరి నెలలో 349 ఈ పెట్టి కేసులు నమోదు-జిల్లా ఎస్పీ ఎగ్గడి భాస్కర్**

**జగిత్యాల,**

జిల్లా పరిధిలో చిన్న చిన్న నేరాలకు పాల్పడుతున్న వారిని అంతటితోటే వారి ప్రవర్తనలో మార్పు తీసుకుని రావడానికి వారిని కట్టడి చేయడానికి భవిష్యత్తులో పెద్ద నేరాలు చేయకుండా నివారించడానికి ఈ పెట్టి కేసులు నమోదు చేయడం జరుగుతుందని ఎస్పిఎగ్గడి భాస్కర్‌తెలిపారు. చిన్న నేరాల చేసినప్పుడే కేసు నమోదు చేసి, కౌన్సిలింగ్ నిర్వహించి వారిని సక్రమ మార్గంలో నడపడానికి జిల్లా ఎస్పీ పోలీస్ అధికారులకు సిబ్బందికి ప్రతి నెల



జరిగే మీటింగ్లలోఈ పెట్టి కేసులు వేసి, పెద్ద పెద్ద నేరాలు జరగకుండా నివారించవచ్చుని, తగు సూచనలు సలహాలు చేస్తూ ఉండడం వల్ల పోలీస్ అధికారులు సిబ్బంది కలిసి బ్లూ కోర్ట్స్, పెట్రో కార్ తదితరులు గస్తీ నిర్వహించినప్పుడు ఈ పెట్టి కేసులు నమోదు చేయడం జరుగుతుంది. బహిరంగ ప్రదేశంలో మద్యం సేవించి చిన్నపాటి నేరాలు చేసే అవకాశం ఉన్నందున వారందరిపై కేసులు నమోదు చేసి కోర్టులో హాజరు పరచడం , గ్రామాలలో పట్టణాలలో చిన్న చిన్న పెట్టి మ్యాటర్స్, తిట్టుకోవడం, చేతులతో కొట్టుకోవడం, పబ్లిక్ ప్రదేశాలలో న్యూసెన్స్ చేయడం మరియు ప్రజాశాంతికి భంగం కలిగించే విధంగా ప్రవర్తించే వారిపై వారి యొక్క నడవడికలో మార్పు తేవడానికి కౌన్సిలింగ్ నిర్వహించడం ద్వారా నేరాలు తగ్గుముఖం పట్టడం జరుగుతుంది. జిల్లా పరిధిలో గత ఫిబ్రవరి నెలలో 349 ఈ పెట్టి కేసులు నమోదు చేయడం జరిగింది. ఈ పెట్టి కేసులు నమోదు చేయడం ద్వారా పెద్ద పెద్ద నేరాలు జరగకుండా నివారించవచ్చని బ్లూ కోర్ట్స్ పెట్రో కార్ సిబ్బంది విధినిర్వహణలో ఉన్నప్పుడు వారికి అందజేసిన అత్యాధునిక టెక్నాలజీ టెక్నాలజీ తో కూడిన ట్యాబులల్లో ఫోటో తీసి అప్లోడ్ చేసి వెంటనే కేసు నమోదు చేయడం జరుగుతుంది తదుపరి కౌన్సిలింగ్ నిర్వహించి కోర్టులో హాజరు పరచడం జరుగుతుంది. ఈ విదంగా గత ఫిబ్రవరి నెలలో 312 మందిపై నమోదైన పెట్టి కేసుల్లో వారికి కోర్ట్ ద్వార జరిమానాలు విధించడం జరిగిందని ఎస్పీ తెలిపారు.

# పరీక్షా కేంద్రాల వద్ద 144 సీఆర్పీసీ సెక్షన్ అమలు

**ఉదయం 9 గంటలకు కచ్చితంగా ప్రధాన ద్వారాలు మూసివేత**

**విద్యార్థులు ఒక్క నిమిషం ఆలస్యమైనా అనుమతి నిరాకరణ**

**తిరుపతి**

శనివారం నాడు రాష్ట్ర ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణకు సంబంధించి శ్రీ వెంకటేశ్వర జూనియర్ కళాశాల సమావేశ మందిరం నందు జిల్లావ్యాప్తంగా ఉన్న ఇంటర్మీడియట్ పరీక్షా కేంద్రాల చీఫ్ సూపరిండెంట్ లతో జిల్లా ఎస్పీ పి పరమేశ్వర రెడ్డి, జిల్లా కలెక్టర్ కె వెంకట రమణారెడ్డి, సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వారు గత అనుభవాలను గుర్తు చేసుకుంటూ, ఈ సంవత్సరం చాలా ప్రతిష్టాత్మకంగా ఇంటర్మీడియట్ పరీక్షలను నిర్వహిస్తున్నారు. అందులో మనం కూడా భాగస్వామ్యం అయినందున చాలా సంతోషం ఈ భాద్యతను గుర్తెరిగి భాద్యతలను అప్పగించిన అధికారులందరూ ఎలాంటి అవకతవకలకు తావు లేకుండా నిఖచ్చిగా విధులు నిర్వర్తిన్చాలన్నారు. భద్రతాపరంగా జిల్లా వ్యాప్తంగా ఉన్న 83 పరీక్ష కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఉండేందుకు సీఐ స్థాయి అధికారితో మొబైల్ పార్టీని ఏర్పాటు చేశామన్నారు.
పరీక్షా కేంద్రం లోపల సహాయకులుగా ఉన్న సిబ్బందిని కూడా ఒక గంట గమనిస్తూ ఉండి ఎలాంటి చట్ట విరుద్ద ఘటనలు జరగకుండా



చూడాల్సిన బాధ్యత చీఫ్ సూపరిండెంట్ లదే అని గుర్తు చేశారు. ఉదయం 7 గంటలకు చీఫ్ సూపరిండెంట్ మరియు సంబంధిత పోలీసు అధికారి పరీక్షా కేంద్రానికి చేరుకొని, అన్ని పరీక్ష గదుల యొక్క కిటికీలు, డెస్కు, వాష్ రూమ్లు లను సూక్ష్మంగా, క్షుణ్ణంగా తనిఖీ చేయాలి. ఆ తర్వాతనే పరీక్షల నిర్వహణ సిబ్బందిని కూడా పూర్తిగా తనిఖీ చేసిన పిమ్మట, పరీక్షా కేంద్రం లోపలికి అనుమతి ఇవ్వాలని ఆదేశించారు. పరీక్షా కేంద్రం లోకి విద్యార్థులతో పాటు పరీక్షా కేంద్రం వద్ద విధులు నిర్వహించే అన్ని శాఖల సిబ్బంది, అధికార యంత్రాంగానికి కూడా ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్స్, స్మార్ట్ వాచ్, మొబైల్ ఫోన్స్, ఐపాడ్ మొదలగు ఎటువంటి ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతి లేదన్నారు ఉదయం 9 గంటలకు ఒక్క నిమిషం ఆలస్యమైనా పరీక్ష కేంద్రం లోనికి అనుమతి లేదు. కావున దయచేసి విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఈ విషయాన్ని గమనించి సరైన సమయంలో పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఎందుకనగా ప్రతి పరీక్షా కేంద్రం వద్ద సీసీ కెమెరాల ద్వారా నిరంతర నిఘా ఉంటుంది కాబట్టి దయచేసి నిర్దేశిత సమయంలో గా పరీక్షా కేంద్రానికి చేరుకోవాలన్నారు. చిట్టీలు, మాస్ కాపీయింగ్, మాల్ ప్రాక్టీస్ వంటి చర్యలకు విద్యార్థులు ఎవరైనా పాల్పడితే, వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడంతో పాటు అవసరమైతే కేసులు కూడా నమోదు చేయడం జరుగుతుందన్నారు. జిల్లావ్యాప్తంగా ఏ పరీక్షా కేంద్రం వద్ద అయినా ఎటువంటి చిన్న ఘటన జరిగిన వెంటనే ఆఎంఒ 100, కంట్రోల్ రూమ్ కు సమాచారం అందించాలని చీఫ్ సూపరిండెంట్ లకు ఆదేశాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ కులశేఖర్ పరిపాలన డి.ఎస్.పి లు ఎస్బి సురేందర్ రెడ్డి, వెస్ట్ నరసప్ప, సీఐలు మరియు పరీక్షా కేంద్రాల చీఫ్ సూపరిండెంట్లు పాల్గొన్నారు.

ప్రజా తపన
prajathapana.com
News that matters

# కవితమ్మా ... ధైర్యంగా ఉండండి

**హైదరాబాద్**

ఎమ్మెల్సీ కవితను ధైర్యంగా వుండండంటూ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. ఈ మేరకు అయన ట్వీట్ చేసారు. పిచ్చి కుక్కల్ని వేటాడే క్రమంలో వాటి కాట్లు మన చేతిపై పడ్డయి. అంత మాత్రాన వేట ఆపుతామా ? కేసిఆర్ కుటుంబ సభ్యులమైన మేమందరం,ముఖ్యంగా నిజామాబాద్ జిల్లా ప్రజలందరం మీ ధర్మపోరాటంలో మీతోపాటు ఉన్నాము.. ఉంటము కూడా. ధర్మం మీ వైపు ఉంది. అంతిమ విజయం మీదే. మనదే నని అయన పేర్కోన్నారు.

## ఈడీ ముందు కవిత హాజరు

**న్యూ ఢిల్లీ**



ఢిల్లీ లిక్కర్ స్కాంలో విచారణ నిమిత్తం ఎమ్మెల్సీ కవిత శనివారం ఈడీ ముందు హాజరయ్యారు. అందరికీ అభివాదం చేస్తు ఆమె ఈడీ ఆఫీసు లోపలికి వెళ్లారు. మాట్లాడేందుకు మీడియా ప్రతినిధులు ప్రయత్నించినా ఆమె మాట్లాడకుండా వెంటనే లోనికి వెళ్లారు. ఈడీ ఆఫీసు గేట్ వరకూ వచ్చిన మంత్రి శ్రీనివాస్ గౌడ్, బీఆర్ఎస్ నేతలు ఆమెకు మద్దతుగా వచ్చారు. ఏపీజే అబ్దుల్ కలాం రోడ్డులోని ఈడీ కార్యాలయం ముందు భారీగా పోలీసులు మోహరించారు. కేంద్ర భద్రతాదళాలను కుడా మోహరించారు.

## టీడీపీ ప్రచారం

**ఎమ్మిగనూరు**



శనివారం నాడు ఎమ్మెల్సీ ప్రచారం చివరి రోజు 16వ వార్డు ఇంచార్జ్, మాజీ కౌన్సిలర్ దాదాసాహెబ్ ఆధ్వర్యంలో చివరి రోజు ప్రచారంలో భాగంగా పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా స్థానిక ఎమ్మిగనూరు పట్టణంలోని శారద కాన్వెంట్ లైను గిప్సన్ కాలనీ, రామయ్య కొట్టాలు అబ్దుల్లా నగర్ తదితర ఆయా ఏరియాలలో గల పట్టభద్రులను కలిసి పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో టిడిపి తరపున పోటీ చేయుచున్న భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటును వేసి వేయించి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఓటర్ బ్యాలెట్ నమూనా చూపిస్తూ, ఓట్లు వేసి గెలిపించాలని ఓటర్లను కోరారు. అలాగే పట్టభద్రుల, నిరుద్యోగుల, ప్రయివేటు ఉద్యోగుల సమస్యలను శాసన మండలిలో వినిపించే సత్తా ఉన్న తెలుగుదేశం అభ్యర్థి భీమిరెడ్డి రాంభూపాల్ రెడ్డి వారికి ఓటు వేసి వేయించి గెలిపించాలని పట్టభద్రులను కోరారు. ఈ కార్యక్రమంలో యూనిటీ ఇంచార్జ కామర్థి మహేష్, బూత్ కన్వీనర్, బి రఘు, గంగన్న, దాదా కలందర్, అబ్దుల్లా , మహబూబ్ భాష, ఫయాజ్ మరియు వార్డ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## సజ్జల రామకృష్ణారెడ్డి కుమారుడు భార్గవ్ రెడ్డిపై టీడీపీ అనిత ఫిర్యాదు

**విశాఖపట్నం**

వైసీపీ ప్రభుత్వ సలహా దారు సజ్జల రామకృష్ణారెడ్డి కుమారు డు భార్గవ్ రెడ్డిపై టీడీపీ రాష్ట్ర మహి ళా అధ్యక్షురాలు అనిత విశాఖ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సజ్జల కుమారుడు తన వ్యాఖ్యలను మార్ఫింగ్ చేసి సోషల్ మీడియాలో పెడుతున్నారంటూ ఫిర్యాదులో పేర్కొన్నారు. చంద్రబాబును గద్దె దింపాలని, జగన్మోహన్ రెడ్డి సీఎం అవ్వాలని తాను అనలేదని.. ఇలాంటి వ్యాఖ్యలను ఎడిట్ చేయడం దారు ణమని మండిపడ్డారు. ఇది మహిళా దినోత్సవం రోజున తమ అనుకూల మీడియాలో కూడా ప్రసారం చేస్తారా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. చిత్తూ రు జిల్లా లో ఈ ఘటన చోటు చేసుకుం దని తెలిపారు. ఈ విషయంపై తమ నియోజకవర్గం పాయకరావుపేటలో కూడా ఫిర్యాదు చేసినట్లు టీడీపీ నేత చెప్పారు.వైసీపీ నేతలు పైశాచిక ఆనందం పొందుతున్నారని మండి పడ్డారు. ప్రభుత్వాన్ని ఎవరైనా నిలదీస్తే వారిపై కేసులు పెడతారని... తమపై ఇష్టనుసారంగా సోషల్ మీడియాలో ట్రోల్ చేస్తే ఫిర్యాదు మాత్రం తీసుకోరని మండిపడ్డారు. రాష్ట్రంలో పోలీస్ వ్యవస్థ నిర్వీర్యం అయిపోయిందన్నా రు. దిశ పీఎస్ పెట్టారని... అసలు దిశ చట్టం ఉందా అని ప్రశ్నించారు.బాధ్యు లపై చర్యలు తీసుకోవాలని సైబర్ క్రైమ్ పోలీసులకు అనిత డిమాండ్ చేశారు.

## కట్టుకున్న పోలీసు బ్యాండు

**విశాఖపట్నం**

లాఠీ పట్టిన చేత్తోనే అబ్బురపరిచే వాయిద్యాలతో విశాఖ పోలీసులు ఆకట్టుకున్నారు.బందోబస్తు నిర్వహించే సిబ్బందే బృందంగా ఏర్పడి మనసును ఉల్లాసపరుస్తారు.విశాఖ పోలీస్ శాఖలోని ఏఆర్ విభాగంలో బ్యాండు బృందమూ పోలీస్ బ్రాస్ బ్యాండు ప్రతి నెలా రెండో శనివారం విశాఖ బీచ్రోడ్డులో ఆ బృందం సంగీత కచేరి నిర్వహిస్తూ, సందర్శకుల్ని ఉత్సాహ పరుస్తుంటుంది.

# కాంగ్రెస్ వర్కింగ్ కమిటీలో స్థానం ఎవరికి...?

**హైదరాబాద్:**

కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ లోకి తెలంగాణ రాష్ట్రం నుంచి ఒకరికి అధిష్టానం అవ కాశం కల్పిస్తుందని ఆ పార్టీలో జోరుగా ప్రచారం జరుగుతుంది. దేశ వ్యాప్తంగా పార్టీ బలంగా ఉన్న రాష్ట్రాల్లో తెలంగాణ ఉండటం విశేషం.. తెలంగాణ కాంగ్రెస్‌లో ఇప్పుడు సీడబ్ల్యూసీ ఎంపిక ప్రక్రియ రోజురోజుకు హీట్ పెంచుతుంది.ఈ ఏడాది చివరలో అసెంబ్లి ఎన్నికలు ఉండటంతో రాష్ట్రానికి పార్టీ పదవుల్లో ప్రాధాన్యత కల్పిస్తారని వాదన బలంగా వినిపిస్తోంది. కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ ఎంపికలో రాజకీయ సమీకరణాలు మారడంతో తెలంగాణ నుంచి ఎవరికి అవకాశం వస్తుందనే చర్చ కాంగ్రెస్ వర్గాల్లో జరుగుతోంది. తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో సీడబ్ల్యూసీ పదవి కోసం చాలా మంది నేతలు రేసులో ఉన్నారు. మాజీ పీసీసీ అధ్యక్షుడు నల్గొండ ఎంపీ ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నేతలు వి.హనుమంతరావు, జానారెడ్డి, పొన్నాల లక్ష్మయ్య, దామోదర రాజనర్సింహా, ములుగు ఎమ్మెల్యే సీతక్క పేర్లు ప్రధానంగా వినిపిస్తున్నాయి.రేసులో వున్న నేతల్లో ఎవరి ప్రయత్నాలు వారు చేసుకుంటున్నారు. మాజీ పీసీసీ అధ్యక్షుడు,ఎంపీ ఉత్తమ్ కుమార్ రెడ్డి పేరు మొదటగా ప్రధానంగా వినిపించింది. పార్టీలో సీనియర్ కావడంతో పాటు అధిష్టానంకు సన్నిహిత నేత కావడంతో ఉత్తమ్ కు అవకాశలలం కల్పిస్తారు అనే చర్చ జరిగింది. కానీ ఉత్తమ్ కి చెక్ పెట్టేందుకు రేవంత్ రెడ్డి రంగంలోకి దిగినట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. మాజీ సీఎల్పీ నేత జానారెడ్డిని సపోర్ట్ చేస్తూ రేవంత్ ఢిల్లీ కేంద్రంగా పావులు కదులుతున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి.ఇప్పటికే జానా రెడ్డి హుటాహుటిన డిల్లికి బయలుదేరారు. మల్లికార్జున ఖర్గ్ తో బేటీ కానున్నారు. ఈ నేపథ్యంలో సీడబ్ల్యూసీ లాబీంగ్ కోసమే వెళ్లారు అన్న ప్రచారం జరుగుతుంది. మరో వైపు సామాజిక వర్గ సమీకరణల ఆధారంగా బీసీ కోటాలో కాంగ్రెస్ సీనియర్ నేతలు వి.హనుమంతరావు, పొన్నాల లక్ష్మయ్య తమకు అవకాశం దక్కుతుందని భావిస్తున్నారు.ఇదిలా ఉంటే ములుగు ఎమ్మెల్యే సీతక్కకు అవకాశం ఇస్తారనే చర్చ జోరుగా సాగుతుంది. సీతక్కకు రాహుల్ గాంధీ ఆశీస్సులు ఉండటంతో ఆమె కూడా రేస్ లో ఉందనే టాక్ వినిపిస్తుంది. కానీ రేవంత్ సీతక్కకు మద్దతు తెలపకుండా జానారెడ్డిని సీడబ్ల్యూసీ మెంబర్ చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు వినికిడి.ఇదంతా ఒక ఎత్తు అయితే కాంగ్రెస్ వర్కింగ్ కమిటీలో ప్రస్తుతం తెలుగు రాష్ట్రాల నుంచి టి.సుబ్బిరామిరెడ్డి సీడబ్ల్యూసీ సభ్యుడిగా కొనసాగుతున్నారు. ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో సుబ్బి రామిరెడ్డి వైపే ప్రియాంక గాంధీ మొగ్గ చూపుతున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. సీడబ్ల్యూసీలో ఎవరికి చోటు లభిస్తుందా.. అన్న చర్చ కాంగ్రెస్ వర్గాల్లో పెద్ద ఎత్తున జరుగుతుంది. కాంగ్రెస్ పార్టీ ఉదయ్ పూర్ డిక్లరేషన్ ప్రకారం సీడబ్ల్యూసీ పదవి తమకు దక్కుతుంది.. అంటే దక్కుతుందనే ధీమాలో కాంగ్రెస్ నేతలు ఉన్నారు.ఉమ్మడి ఆంధ్రపదేశ్‌లో సీడబ్ల్యూసీలో కేవలం ముగ్గురికే అవకాశం కల్పించారని.. వారిలో మాజీ ముఖ్య మంత్రులు కాసు బ్రహ్మానందంరెడ్డి, కోట్ల విజయ భాస్కర్‌రెడ్డితో పాటు పీసీసీ మాజీ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు, ప్రస్తుత బీఆర్ఎస్ నేత కె. కేశవరావుకు పార్టీ అధిష్టానం అవకాశం కల్పించింది. మొత్తానికి ఇలిఇ పై చాలా మంది నాయకులు ఆశలు పెట్టుకున్నారు. ఇందులో కోమటిరెడ్డి, మల్లు రవి లాంటి నాయకులు మాకంటే మాకు అని ధీమా వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో ఎవరి పేరు వొస్తే ఎం జరుగుతుందో అని కాంగ్రెస్ క్యాడర్ టెన్షన్ పడుతోంది. అధిష్టానం వద్ద టీ కాంగ్రెస్ నేతల చర్చలు ఎంతవరకు ఫలిస్తాయో.. ఎవరు సీడబ్ల్యూసీలో పాగా వేస్తారో వేచి చూడాలి మరి..

# ఆలస్యంగా వస్తే అనుమతి లేదు

### పదో తరగతి పబ్లిక్ పరీక్షలపై పాఠశాల విద్యాశాఖ సర్క్యులర్

ఉదయం 8.45 గంటల నుంచి 9.30 వరకు పరీక్ష హాల్లోకి అనుమతిఆ తర్వాత ఎవరినీ అనుమతించరు 12.45 గంటల తర్వాతే పరీక్ష కేంద్రం నుంచి బయటకు..3 నుంచి 18 వరకు పరీక్షలుఉదయం న్యూస్ ప్రతినిధి అమరావతి×: రాష్ట్రంలో ఏప్రిల్ 3 నుంచి 18 వరకు జరిగే పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులను ఉదయం 8.45 గంటల నుంచి 9.30 గంటల వరకు మాత్రమే పరీక్ష హాల్లోకి అనుమతిస్తామని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఎస్.సురేష్‌కుమార్ తెలిపారు. 9.30 గంటల తర్వాత ఆలస్యంగా వచ్చిన ఎవరినీ అనుమతించబోమన్నారు. ఈ మేరకు ఆయన శుక్రవారం సర్క్యులర్ విడుదల చేశారు. అన్ని పరీక్షలను నిర్దేశించిన తేదీల్లో ఉదయం 9:30 గంటల నుంచి 12:45 గంటల వరకు నిర్వహిస్తామని చెప్పారు.

**విద్యార్థులకు సూచనలు..**

హాల్‌టికెట్లు పొందాక విద్యార్థులంతా తమ పేరు, పుట్టిన తేదీ, ఫొటో వంటి అన్ని వివరాలను సరిచూసుకోవాలి. వాటిలో పొరపాట్లు గమనిస్తే పాఠశాల హెడ్‌మాస్టర్/ప్రిన్సిపాల్‌నిసంప్రదించాలి. విద్యార్థులు తప్పనిసరిగా హాల్‌టికెట్‌లను తమతో పాటు పరీక్షకు తీసుకెళ్లాలి. హాల్‌టికెట్ లేకపోతే పరీక్షకు అనుమతించరు. పరీక్ష కేంద్రంలోకి మొబైల్ ఫోన్‌లు, ల్యాప్‌టాప్‌లు, స్పీకర్లు, స్మార్ట్ వాచ్‌లు, బ్లూటూత్, కెమెరాలు, ఇయర్ ఫోన్‌లు వంటి ఎలక్ట్రానిక్ పరికరాలను తీసుకురాకూడదు. ఎవరైనా వాటిని లోపలకు తీసుకువెళ్తే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటారు. విద్యార్థులు ఫిజికల్ సైన్స్, నేచురల్ సైన్స్ ప్రశ్నలను వేర్వేరు సమాధాన పత్రాల్లో రాయాలి. ఈ రెండింటి కోసం వేర్వేరుగా 12 పేజీల సమాధానాల బుక్‌లెట్లు ఇస్తారు.విద్యార్థులను అత్యవసర పరిస్థితుల్లో మినహా 12:45 గంటల వరకు పరీక్ష హాల్ నుంచి బయటకు వెళ్లడానికి అనుమతించరు. ప్రశ్నపత్రాల లీక్ అని తప్పుడు, నిరాధారమైన పుకార్లకు పాల్పడకూడదు. వదంతులను వ్యాప్తి చేస్తే కఠిన చర్యలు తీసుకుంటారు. పరీక్ష సమయంలో అక్రమాలకు పాల్పడేవారిపై, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే వారిపై చర్యలు ఉంటాయి. అలాంటివారిని తదుపరి పరీక్షలు రాయనీయరు. విద్యార్థి పేరు, రోల్ నంబర్, ఇతర వివరాలను 24 పేజీల జవాబు బుక్‌లెట్, మ్యాప్ లేదా గ్రాఫ్ షీట్‌లోని ఏ పేజీలోనూ రాయకూడదు. కాగా పరీక్షలు జరిగే రోజుల్లో ఎంఈవోలు, హెచ్‌ఎంలు, చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్ల విధులపైనా సూచనలు జారీ చేశారు.

# దర్యాప్తు సంస్థల దశకంఠుడిగా మోదీ

### ఫ్లెక్సీ, బీజేపీ నేతలు సీరియస్

**హైదారాబాద్**

సికింద్రాబాద్ జేబీఎస్ వద్ద కంటోన్మెంట్ గ్రౌండ్ లో మోదీ దశకంఠని రూపంలో ఉన్న ఫ్లెక్సీని ఏర్పాటుచేశారు గుర్తుతెలియని వ్యక్తులు. దీనిపై బీజేపీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేవైఎం నేతలు ఆ ఫ్లెక్సీని చించివేశారు. దశకంఠుడి రూపంలో మోదీ ఫ్లెక్సీని ఏర్పాటు చేసి పది తలల కింద ఈడీ, సీబీఐ, ఐటీ, అదానీ, ఈసీ, డీఆర్ఐ, ఐబీ, ఎన్సీబీ,ఎన్ఐఏ తొమ్మిది తలలుగా మధ్యలో మోదీ ఫొటోను పెట్టారు. ఈ ఫ్లెక్సీ పైన ప్రజాస్వామ్య విధ్వంసకుడు, వంచనకు తాత అని రాశారు. ఈ ఫ్లెక్సీని బీజేవైఎం నేతలు చించివేసి బీఆర్ఎస్ కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. టీఎస్ఎండీసీ ఛైర్మన్ క్రిషాంక్ ఈ ఫ్లెక్సీని ఏర్పాటు చేశారని ఆరోపిస్తూ ఆగ్రహం వ్యక్తం చేశారు. మరొసారి ఇటువంటి చర్యలకు పాల్పడితే తగిన గుణపాఠం చెబుతామని క్రిషాంక్ ను హెచ్చరించారు బీజేవైఎం నేతలు. లిక్కర్ స్కామ్ కేసులో ఢిల్లీలో విచారణ జరుగుతుండగానే భారీగా పోస్టర్లు వెలిశాయి. బైబై మోడీ అంటూ హ్యాష్ ట్యాగ్‌తో కనిపించిన ఈ పోస్టర్లపై చాలా బీజేపీపై తీవ్ర ఆరోపణలు ఉన్నాయి. కమలం కండువా కప్పుకుంటే చాలా కేసులు మాఫీ అంటూ వాషింగ్ పౌడర్ వేసి అంతక ముందు ఆ తర్వాత అనేది సూచిస్తూ పోస్టర్లు కనిపిస్తున్నాయి. తెలంగాణలో ఈ మధ్య కాలంలో సరికొత్త రాజకీయం కనిపిస్తోంది. ఏదైనా మెయిన్ ఇష్యూ నడుస్తున్నప్పుడు దాన్ని సమర్థిస్తూనో వ్యతిరేకిస్తూనో గుర్తు తెలియని వ్యక్తులు పోస్టర్లు, ఫెక్సీలు వేస్తున్నారు. హైదరాబాద్ నగరంలో చాలా ప్రాంతాల్లో వీటిని ఏర్పాటు చేస్తున్నారు. ఇది నగర ప్రజలను ఆకట్టుకుంటోంది. ఇప్పుడు ఇలాంటి పోస్టర్లు ఢిల్లీలో కూడా ఏర్పాటు చేశారు. ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితను ఈడీ విచారిస్తుంది. ఈటైంలో ఆమెకు మద్దతుగా పోస్టర్లు వెలిశాయి. అదే టైంలో బీజేపీని విమర్శిస్తూ దర్యాప్తు సంస్థల తీరును తప్పుపడుతూ ఈ పోస్టర్లు కనిపిస్తున్నాయి. దర్యాప్తు సంస్థలతో బీజేపీ రాజకీయాలు చేస్తోంది అనే విమర్శలతో ఢిల్లీ వ్యాప్తంగా భారీగా పోస్టర్లు వెలిశాయి. రాత్రికి రాత్రే ఈ పోస్టర్లను గుర్తు తెలియని వ్యక్తులు అతికించారు. బీఆర్ఎస్ మద్దతుదారులే వీటిని ఏర్పాటు చేసి ఉంటారని స్పష్టం అవుతుంది కానీ ఎవరనేది మాత్రం క్లారిటీ లేదు. ప్రత్యర్థులను ఎలిమినేట్ చేయడానికో, అణచివేసేందుకు మాత్రమే ఈడీ, సీబీఐ, ఐటీ లాంటి సంస్థలను బీజేపీ వాడుకుంటోందన్న ఆరోపణలతో పోస్టర్లు వేశారు. ఇందులో కవితకు మద్దతుగా కూడా కొటేషన్లు ఉన్నాయి. అదే టైంలో కేసులు ఉన్న వ్యక్తులు బీజేపీలో చేరితే ఎలాంటి కేసులు ఉండబోవన్న విషయాన్ని కూడా పోస్టర్లలో చెప్పారు. గత కొన్నేళ్లుగా బీజేపీలో చేరిన వారి పేర్లు ఫొటోలను అందులో చెబుతూ చేరక ముందు ఉన్న కేసులు చేరిన తర్వాత వాళ్ల కేసుల స్టేటస్‌ను ఈ పోస్టర్లలో వివరించారు. జ్యోతిరాదిత్య సింధియా, అసోం ముఖ్యమంత్రి హిమంత విశ్వ శర్మ, వెస్ట్ బెంగాల్ బీజపీ ముఖ్యనేత సువేందు అధికారి, ఏపీ ఎంపీ సుజనా చౌదరి, కేంద్ర మాజీ మంత్రి నారాయణ్ రాణె ఇలా కేసుల్లో నిండా మునిగిన వాళ్లు కూడా రైడ్ జరిగిన తర్వాత బీజేపీలో చేరి కేసుల నుంచి తప్పించుకున్నారనే విమర్శ వచ్చేలా పోస్టర్లు వేశారు. మధ్యలో రైడ్ అనే వాషింగ్ పౌడర్ వేసి వ్యంగ్యంగా ఈ పోస్టర్‌ను డిజైన్ చేశారు. వాళ్లంతా ముందు బురద మరకలతో ఉన్నప్పుడు రైడ్ జరుగుతుందని వెటంనే వాళ్లంతా కాషాయం దుస్తుల్లోకి మారిపోతున్నట్టు అందులో వివరించారు. కవిత ఫొటో కూడా పోస్టర్‌లో వేశారు. తెలంగాణ నుంచి కవిత రైడ్ జరగక ముందు జరిగిన తర్వాత కూడా ఎలాంటి మార్పు లేకుండా ఉన్నారని ఎలాంటి మార్పులు లేవని పేర్కొన్నారు. ట్రూ కలర్ నెవర్ ఫేడ్ అంటూ క్యాప్షన్ కూడా ఇచ్చారు. నిజమైన రంగు ఎప్పటికీ వెలిసిపోదని చెప్పారు. చివరకు బైబై మోడీ అంటూ హ్యాగ్ ట్యాగ్ జత చేశారు.

# స్కిల్ డెవలప్‌మెంట్ స్కాంలో కీలక పరిణామం

**విశాఖపట్నం**

స్కిల్ డెవలప్‌మెంట్ స్కాంలో కీలక పరిణామం చోటు చేసుకుంది. నలుగురు కీలక నిందితులను కస్టడీకి ఇవ్వాలంటూ మనీలాండరింగ్ ప్రత్యేక న్యాయస్థానంలో ఈడీ పిటిషన్ దాఖలు చేసింది. ఈ నెల మొదటి వారంలోనే నలుగురిని ఈడీ అరెస్ట్ చేసింది. మార్చి 4న నిందితులకు కోర్టు రిమాండ్ విధించింది. ప్రస్తుతం వైజాగ్ జైల్లో నిందితులు ఉన్నారని, నిందితుల కస్టడీ పిటిషన్‌పై సుదీర్ఘంగా వాదనలు సాగాయి. నిందితుల తరపున వాదించేందుకు ఢిల్లీ, కలకత్తా, ముంబై నుంచి న్యాయవాదులు వచ్చారు. విచారణ సోమవారానికి వాయిదా వేసినట్లు న్యాయస్థానం తెలిపింది. స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో మాజీ ఎండీ ఆర్జా శ్రీకాంత్ రెండోవ రోజు విచారణకు హాజరయ్యారు. సాయంత్రం 6 గంటలకు విచారణ పూర్తికావడంతో శ్రీకాంత్ ఢిల్లీ బయలుదేరి వెళ్లారు.ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ కేసులో ఈడీ రంగంలోకి దిగింది. ఈ కేసులో కోట్ల రూపాయలు దుర్వినియోగం అయ్యాయని ఈడీ పేర్కొంది. ఈ కేసులో మొత్తం నలుగురిని అరెస్ట్ చేసినట్లు పేర్కొన్న ఈడీ అధికారులు తెలిపారు. సీమెన్స్ సంస్థ మాజీ ఎండీ సౌమ్యాద్రిశేఖర్ బోస్ అరెస్టతోపాటు డిజైన్ టెక్ ఎండీ వికాస్ వినాయక్, పీవీఎస్‌పీఐడీ స్కిల్ సీఈవో ముకుల్‌చంద్ అగర్వాల్, సారా చార్టెర్డ్ అసోసియేట్స్‌కు చెందిన సురేష్ గోయల్‌ను అరెస్ట్ చేసినట్లు ఈడీ అధికారులు చెప్పారు. నిందితులను విశాఖ ఈడీ కోర్టులో హాజరుపర్చినట్లు అధికారులు వెల్లడించారు.

## వైకాపా అభ్యర్థిపై చర్యలు తీసుకోవాలి

**విశాఖపట్నం**

ఓటర్లను ప్రలోభాలకు పాల్పడుతున్న వైసిపి అభ్యర్థి సీతం రాజు సుధాకర్పై కఠిన చర్యలు తీసు కోవాలని విశాఖ 78వ వార్డు కార్పొరే టర్ గంగారావు డిమాండ్ చేశారు. ఈమేరకు ఆయన మీడియాతో మాట్లాడారు. ఓటర్లకు వెండి నాణేలు పంచిపెట్టేందుకు దాచి పెట్టిన రూము ను అధికారులు చూపించినా పట్టించు కోలేదని ఆరోపించారు. వెండివస్తువు లు విశాఖ ఆర్కే బీచ్లోని మెజిస్టిక్ టవర్లో తన ఆఫీస్ అయిన 101 ప్లాట్లో స్టాక్ చేసిన విషయాన్ని అధి కారులకు ఫిర్యాదు చేసినా పట్టించు కోలేదన్నారు. కంప్లైంట్ ఇచ్చిన మమ్మ ల్ని బలవంతంగా అపార్టుమెంట్ దగ్గర నుండి పోలీసులు బయటకు నెట్టేశార న్నారు.పట్టభద్రులందరూ వైసిపి తాయలాలను, డబ్బుపంపిణీని తిరస్కరించాలని, ప్రజాస్వామ్యాన్ని కాపాడి, పీడీఎఫ్ అభ్యర్థి అయిన డాక్టర్ కోరెడ్ల రమాప్రభను గెలిపిం చాలని 78వ వార్డు కార్పొరేటర్ గంగా రావు కోరారు.

## నా ప్రసంగం వీడియోపై చర్యలు తీసుకోవాలి-టీడీపీ అనిత

**అనకాపల్లి**

రాష్ట్రంలో పోలీసు వ్యవస్థ గాడి తప్పిందని, కొన్ని స్టేషన్లు కన్సల్టె న్సీ కేంద్రాల మాదిరిగా మారాయని తెలుగు మహిళ రాష్ట్ర అధ్యక్షురాలు వంగలపూడి అనిత ఆరోపించారు. అనకాపల్లి జిల్లా పోలీసు కార్యాల యంలో ఎస్పీ గౌతమిశాలిని కలిశారు. తన ప్రసంగం వీడియోను తప్పుడు విధానంలో ఎడిట్ చేసి సామాజిక మాధ్యమాల్లో పెట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఫేక్ వీడియోలు చేసి వైరల్ చేసినవారిపై చర్యలు తీసుకోవా లని పాయకరావుపేట స్టేషన్లో ఫిర్యాదు చేయగా, కోర్టులో పరిష్క రించుకోవాలని ఎస్ఐ సలహా ఇవ్వడం ఆశ్చర్యం కలిగించిందన్నారు. దీనిపై డీజీపీ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

## పులివెందులలో వైఎస్ వివేకా హత్య కేసు

**కడప**

పులివెందులలో వైఎస్ వివేకా హత్య కేసు టెన్షన్ కొనసాగుతోంది. రేపు కడపలో సీబీఐ ఎదుట వైఎస్ భాస్కర్ రెడ్డి విచారణకు హాజరుకానున్నారు. అయితే భాస్కర్ రెడ్డిని సీబీఐ అరెస్ట్ చేసే అవకాశం ఉన్నందున ఎంపీ అవినాష్ కుటుంబంతో పాటు వైసీపీ శ్రేణులు ఆందోళన చెందుతున్నాయి. ఎంపీ అవినాష్ రెడ్డితో పాటు ఆయన తండ్రి వైఎస్ భాస్కర్ రెడ్డిలు నిందితులేనని.. అరెస్ట్‌లు తప్పవని హైకోర్టుకు సీబీఐ తేల్చిచెప్పింది. ఈ క్రమంలోనే అవినాష్ కుటుంబాన్ని అరెస్ట్‌ల టెన్షన్ పట్టి పీడిస్తోంది."వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసులో ఎంపీ అవినాశ్ రెడ్డి !, ఆయన తండ్రి వైఎస్ భాస్కర్ రెడ్డి ఇద్దరూ నిందితులే. వారిని అరెస్ట్ చేయాలని గత నెల 24న అవినాశ్ రెడ్డి విచారణ సందర్భంగానే నిర్ణయించాం. వారిని అరెస్టు చేస్తాం" అని సీబీఐ కుండబద్దలు కొట్టింది. తెలంగాణ హైకోర్టుకు ఈ విషయం సూటిగా చెప్పింది. అంతేకాదు... శుక్రవారం మూడోసారి విచారణకు హాజరైన అవినాశ్ రెడ్డి అరెస్టుకు సీబీఐ అధికారులు సర్వం సిద్ధం చేశారు. 'ఆ విచారణ పూర్తయ్యేలోపు ఏ క్షణమైనా అరెస్టు చేస్తాం' అని సీబీఐ న్యాయవాదులు హైకోర్టుకు కూడా చెప్పారు. కానీ... 'సోమవారం దాకా ఆగండి' అని హైకోర్టు ఇచ్చిన మధ్యంతర ఆదేశాలతో అరెస్టు నుంచి అవినాశ్ రెడ్డి తృటిలో తప్పించుకున్నట్లయింది.

# అర్బన్ హెల్త్ సెంటర్ల ఆకస్మిక తనిఖీ

**నంద్యాల**

మార్చి 14 వ తేదీన నిర్వహిస్తున్న జాతీయ నులిపురుగుల నిర్మూలన దినం సందర్భంగా జిల్లా వైద్య, ఆరోగ్య శాఖధికారి డాక్టర్. వెంకటరమణ యం. ఎస్. నగర్ మరియు గాంధి నగర్ అర్బన్ హెల్త్ సెంటర్లను ఆకస్మికంగా తనిఖీ చేసినారు. తనిఖీలో భాగంగా ప్రభుత్వ, ప్రయివేట్ విద్యా సంస్థలకు ఆల్ బెండ జోల్ -400 ఎం. జి నులిపురుగుల మాత్రల పంపిణి వివరాలు, కార్యక్రమం పర్యవేక్షణ ఏర్పాట్లు గురించి వైద్యాధికారులను విచారించారు. రెండు అర్బన్ హెల్త్ సెంటర్ల పరిధిలో ఉన్న ప్రభుత్వ, ప్రయివేట్ విద్యా సంస్థల వివరాలు, 1-19 సంవత్సరాల లబ్ధిదారుల వివరాలు, అంగన్వాడీ కేంద్రాలు, అందులో ప్రీ స్కూల్ 3-6 సంవత్సరాల పిల్లల వివరాలు అడిగి తెలుసుకున్నారు. జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమం మార్చి 14 వ తేది 100% విజయవంతం చేయుటకు కార్యక్రమంలో పాల్గొనే సమన్వయ శాఖల మండల అధికారులు, అనగా విద్యా శాఖ, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులు, ప్రిన్సిపాల్స్, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, అంగన్వాడీ కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది, కార్యక్రమం పర్యవేక్షణ సిబ్బంది సమన్వయము తో కలిసి పని చేయాలని వైద్యాధికారులకు సూచించారు.



నంద్యాల జిల్లాలో మొత్తం 1-19 సంవత్సరముల లబ్ధిదారులు 4 లక్షల మంది ఉన్నారని, ఆల్ బెండ జోల్ -400 ఎం.జి మాత్రలు జిల్లాలో మండల పరిషత్ అభివృద్ధి అధికారుల ద్వారా వారి పరిధిలో ని అన్ని ప్రభుత్వ, ప్రయివేట్ విద్యా సంస్థలకు, ప్రాథమిక పాఠశాల ల నుండి డిగ్రీ మొదటి సంవత్సరము మరియు వృత్తి విద్యా సంస్థలలో చదువున్న విద్యార్థుల వరకు మాత్రలు జిల్లా కలెక్టరు వారి ఆదేశాల ప్రకారం పంపిణి చేయడం జరిగినదని, కార్యక్రమం అమలులో ఎలాంటి పొరబాట్లు జరగకుండా వైద్యులు, వైద్య సిబ్బంది అన్ని రకాల చర్యలు, జాగ్రత్తలు వహించాలని రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం జిల్లా ఇంచార్జి అధికారి డాక్టర్. కాంతారావు నాయక్ సార్ తెలిపారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖధికారి వెంట ప్రోగ్రాం పర్యవేక్షణ అధికారులు డాక్టర్. కాంతారావు నాయక్ మరియు డాక్టర్. చంద్రశేఖర్ ఉన్నారు.

## సైబర్ మోసాలపై పై పోలీసు కళా జాగృతి నాటక ప్రదర్శన

**పోరు మామిళ్ళ**

జిల్లా ఎస్పి కే కే ఎన్ అన్బురాజన్ ఆదేశాల మేరకు పోలీసు కళా జాగృతి బృందం ఆధ్వర్యంలో గత శుక్రవారం పోరుమామిళ్ల సర్కిల్, కలసపాడు పోలీస్ స్టేషన్ పరిధిలోని రామాపురం గ్రామంలో స్థానికులకు నాటక ప్రదర్శన నిర్వహించారు ఇందులో పోరుమామిళ్ల సి.ఐ సురేష్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఎర్ర చందనం అక్రమ రవాణా వల్ల కలిగే అనర్ధాలను, చట్ట పరంగా తీసుకునే చర్యలపై, సైబర్ మోసాలపై అవగాహన కల్పిస్తూ 'పరివర్తన' కార్యక్రమం లో భాగంగా ''మేలు కొలుపు' నాటకం ప్రదర్శించారు. క్రికెట్



బెట్టింగ్, మట్కా, జూదం వల్ల జరిగే దుష్పరిణామాలు వివరిస్తూ కళాజాత బృందం ప్రదర్శించిన నాటకం గ్రామస్తులను బాగా ఆకట్టుకుంది. పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు

## చందనం స్మగ్లర్ లాల్ బాషపై పిడి యాక్టు

**కడప**

కరడు గట్టిన అంతర్ రాష్ట్ర ఎర్ర చందనం స్మగ్లర్ షేక్ సిపంతి బాషపై పోలీసులు పిడి యాక్టు ప్రయోగించారు. కడప జిల్లా చాపాడు మండలం ఖాదర్ పల్లి గ్రామానికి చెందిన బాష గత 10 సంవత్సరాలుగా ఎర్ర చందనం దుంగల అక్రమ రవాణాకు పాల్పడుతున్నాడు. 2013 వ సం. నుండి ఇప్పటివరకు బాషపై 71 ఎర్ర చందనం కేసులు నమోదయ్యాయి. 2003 నుండి ఇతని పై 85 దొంగతనం కేసులు నమోదయ్యాయి. ఇతనికి అనేక మంది అంతర్జాతీయ ఎర్రచందనం స్మగ్లర్లతో సంబంధాలున్నాయని పోలీసులు సమాచారం. బాష తమిళనాడు రాష్ట్రం నుండి కూలీలను తీసుకుని వచ్చి జిల్లాలోని రైల్వే కోడూరు, బలుపల్లి, సానిపాయ, అట్లూరు, చెన్నూర్, బద్వేల్, గువ్వలచెరువు ఘాట్ మరియు సుండుపల్లి ప్రాంతాల్లోని అటవీ ప్రాంతంలో దుంగలను నరికించి వాటిని దుంగలుగా చేయించి కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలకు అక్రమ రవాణా చేసి అంతర్జాతీయ ఎర్రచందనం స్మగ్లర్లకు విక్రయించి అక్రమంగా డబ్బులు సంపాదిస్తున్నాడు. బాష పై పి.డి చట్టం ప్రకారం చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారుల నిర్ణయించారు

## 14.20 లక్షల కోట్ల ప్రత్యక్ష పన్నుల వసూళ్లు

**న్యూఢిల్లీ**

మన దేశంలో ప్రత్యక్ష పన్నుల వసూళ్లు గణనీయంగా పెరుగుతున్నాయి. కార్పొరేట్ సంస్థల ఆదాయంతో పాటు, వ్యక్తిగతంగా ప్రజల ఆదాయాల మీద ప్రభుత్వానికి చెల్లిస్తున్న పన్నుల్లో స్థిరమైన వృద్ధి కనిపిస్తోంది. 2022-23 ఆర్థిక సంవత్సరం మార్చి 10 వరకు నమోదైన ప్రత్యక్ష పన్ను వసూళ్ల గణాంకాలను కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ ) విడుదల చేసింది.ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మార్చి 10వ తేదీ నాటికి... దేశంలో స్థూల ప్రత్యక్ష పన్ను వసూళ్లు రూ. 16.68 లక్షల కోట్లకు చేరుకున్నాయి. అంతకుముందు ఆర్థిక సంవత్సరం ఇదే కాలంతో పోలిస్తే ఇది 22.58 శాతం వృద్ధి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి, ప్రత్యక్ష పన్నుల మొత్తం బడ్జెట్ అంచనాల్లో ఇది 96.67 శాతానికి సమానం. సవరించిన అంచనాల ప్రకారం 78.65 శాతంగా ఉందని ఆర్థిక మంత్రిత్వ శాఖ తన సర్క్యులర్‌లో వెల్లడించింది.పన్ను చెల్లింపుదార్లకు చెల్లించిన పన్ను వాపసుల మొత్తాన్ని సర్దుబాటు చేసిన తర్వాత, మార్చి 10వ తేదీ వరకు నికర ప్రత్యక్ష పన్ను వసూళ్లు రూ. 13.73 లక్షల కోట్లుగా ఉన్నాయి. గత ఏడాది ఇదే కాలంలో వచ్చిన రూ. 12.98 లక్షల కోట్లతో పోలిస్తే ఇది 16.78 శాతం ఎక్కువ. స్థూల ప్రత్యక్ష పన్నుల నుంచి రిఫండ్స్‌ను తీసేస్తే వచ్చే మొత్తాన్ని నికర ప్రత్యక్ష పన్ను వసూళ్లుగా లెక్కిస్తారు.విడివిడిగా చూస్తే... 2022-23 ఆర్థిక సంవత్సరంలో మార్చి 10వ తేదీ వరకు, స్థూల ప్రాతిపదికన కార్పొరేట్ ఆదాయపు పన్ను వసూళ్లు గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే 18.08 శాతం పెరిగాయి. ఇదే కాలంలో, స్థూల ప్రాతిపదికన వ్యక్తిగత ఆదాయపు పన్ను వసూళ్లు సెక్యూరిటీ ట్రాన్సాక్షన్ ట్యాక్స్‌తో కలిపి 27.57 శాతం పెరిగాయి. నికర ప్రాతిపదికన (రిఫండ్‌లను తీసేసి) చూస్తే... కార్పొరేట్ ఆదాయపు పన్ను వసూళ్లు 13.62 శాతం, వ్యక్తిగత ఆదాయపు పన్ను వసూళ్లు 20.73 శాతం మేర పెరిగాయని ఆర్థిక శాఖ వెల్లడించింది. వ్యక్తిగత ఆదాయపు పన్నులో సెక్యూరిటీ ట్రాన్సాక్షన్ ట్యాక్స్‌ను కూడా కలిపితే నికర వసూళ్లు 20.06 శాతం పెరిగాయి.

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో... 2022 ఏప్రిల్ 1వ తేదీ నుంచి 2023 మార్చి 10వ తేదీ వరకు, మొత్తం రూ. 2.95 లక్షల కోట్ల పన్ను మొత్తాన్ని వాపసు (రిఫండ్) చేసినట్లు ఆర్థిక మంత్రిత్వ శాఖ వెల్లడించింది. అంతకుముందు ఏడాది ఇదే కాలంలోని రీఫండ్ మొత్తం కంటే ఇది 59.44 శాతం ఎక్కువ.

2022-23 ఆర్థిక సంవత్సరంలో కేంద్ర ప్రభుత్వం రూ. 14.20 లక్షల కోట్ల ప్రత్యక్ష పన్నుల వసూళ్లు లక్ష్యంగా పెట్టుకుంది.

# బండి సంజయ్‌కు మహిళా కమిషన్ నోటీసులు

**హైదారాబాద్**

తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు బండి సంజయ్ కు తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ నోటీసులిచ్చింది. ఓ సమావేశంలో కవితపై విమర్శలు చేస్తూ.. అభ్యంతరక వ్యాఖ్యలు చేశారని బీఆర్ఎస్ తీవ్రంగా మండిపడింది. ఈ బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలపై మహిళా కమిషన్ సీరియస్ అయ్యింది. వ్యక్తిగతంగా హాజరు కావాలని మహిళా కమిషన్ ఆదేశించింది. తెలిపింది. ఎమ్మెల్సీ కవితపై బండి సంజయ్ వ్యాఖ్యల్ని మహిళా కమిషన్ సుమోటోగా తీసుకుంది. విచారణకు కూడా ఆదేశించింది. సంజయ్ వ్యాఖ్యలపై బీఆర్ఎస్ మహిళా ప్రజాప్రతినిధులు జాతీయ మహిళా కమిషన్‌కు కూడా ఫిర్యాదు చేశారు. శు క్రవారం ఓ బీజేపీ కార్యక్రమంలో మాట్లాడిన బండి సంజయ్ సీఎం కూతురు మాత్రమే గొప్ప అన్నట్లు బీఆర్ఎస్ నాయకుల ప్రవర్తన ఉందని సంజయ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈడీ కేసులకు బీజేపీకి ఎటువంటి సంబంధం లేదని, తప్పు చేయకుంటే కోర్టు ద్వారా నిరూపించుకుని బయటకు రావాలని ఆయన అన్నారు. ఇంతక ముందే మీడియా వాళ్లు కవితను అరెస్ట్ చేస్తారని ఓ ప్రశ్న అడిగారని, దోషిగా తేలితే అరెస్ట్ చేయక ముద్దు పెట్టుకుంటారా? అని వ్యాఖ్యానించారు. బండి సంజయ్ చేసిన కామెంట్లపై బీఆర్ఎస్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. మొదట బీఆర్ఎస్ యువనేత బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలను ట్వీట్ చేసి .. పలువురికి ట్యాగ్ చేశారు ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత మీద బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ చేసిన అనుచిత వ్యాఖ్యలపై బీఆరెస్ శ్రేణులు భగ్గుమన్నాయి. బండి సంజయ్ కి వ్యతిరేకంగా బీఆరెస్ కార్యకర్తలు రోడ్డెక్కారు. హైదరాబాద్ లో, ఢిల్లీలో పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహించారు. హైదరాబాద్ లో బీఆరెస్ కార్యకర్తలు బండి సంజయ్ దిష్టిబొమ్మలు దగ్ధం చేశారు. ఈ నిరసనల్లో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ తన నియోజకవర్గంలో నిరసనలకు నాయకత్వం వహించారు. అదేవిధంగా తెలంగాణ భవన్ వద్ద,జూబ్లీ హిల్స్, పంజా గుట్ట వద్ద, ఢిల్లీలో బీఆరెస్ శ్రేణులు బండి సంజయ్ కి వ్యతిరేకంగా ఆందోళనలు నిర్వహించాయి. హైదరాబాద్ లోని అనేక చోట్ల బీఆరెస్ నిరసనలు వ్యక్తం చేస్తున్నారు. అంతే కాక రాష్ట్ర వ్యాప్తంగా కూడా బీఆరెస్ మహిళా కార్యకర్తలు బండిసంజయ్ వ్యాఖ్యలకు వ్యతిరేకంగా నిరసనలకు దిగారు.

# 15 నుంచి ఒంటిపూట బళ్లు

**విజయవాడ**

ఏపీలో ఒకవైపు ఎండలు మండిపోతున్నాయి. ఇప్పటికే పలు ప్రాంతాల్లో అధిక ఉష్ణోగ్రతలు అత్యధికంగా నమోదవుతున్నాయి. రాష్ట్రంలో ఇంత ఎండల్లోనూ చిన్న పిల్లలు ఉదయం నుంచి సాయంత్రం వరకూ బడుల్లోనే అవస్థలు పడుతున్నారు. అయినా ఒంటిపూట బడులపై ఏపీ పాఠశాల విద్యాశాఖ ఎలాంటి ప్రకటన చేయలేదు. అయితే తెలంగాణలో మార్చి 15 నుంచి ఒంటిపూట బడులు నిర్వహించనున్న నేపథ్యంలో ఏపీలోనూ మార్చి 15 నుంచే ఒకపూట బడులు నిర్వహించే అవకాశం ఉందని భావిస్తున్నారు. మరోవైపు ఊ3ఔ2 వైరస్ హడలెత్తిస్తోంది. దీంతో అనారోగ్యంతో ఉన్న పిల్లలను స్కూళ్లకు పంపొద్దని విద్యాశాఖ తల్లిదండ్రులను కోరింది. గతేడాది తెలంగాణలో మార్చి 15 నుంచే ఒంటిపూట బడులు నిర్వహించగా.. ఏపీలో మాత్రం ఏప్రిల్ 4 నుంచి ఒంటిపూటబడులు ప్రారంభమయ్యాయి. ఎందుకంటే.. ఆ సంవత్సరంలో పాఠశాలలు ఆలస్యంగా ప్రారంభమయ్యాయి. దీంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. కానీ..ఈ ఏడాది అలాంటి సమస్య లేకున్నా.. గతేడాది మాదిరిగానే ఏప్రిల్ 4 నుంచి ఒంటి పూట బడులు ఉండే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. లేదా మార్చి చివరి వారంలో పాఠశాలలకు ఒకపూట బడులు నిర్వహించే అవకాశాలు కూడా లేకపోలేదని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఒంటిపూట బడుల్లో తరగతులు ఉదయం 7.30 నిమిషాల నుంచి 11.30 గంటల వరకు నిర్వహించనున్నారు. ఏపీలో ఏప్రిల్ 30 నుంచి జూన్ 11 వరకు వేసవి సెలవులు ఉండే అవకాశం ఉంది. అంటే విద్యార్థులకు 43 రోజులపాటు వేసవిసెలువులు ఉంటాయి.



### తెలంగాణలో ఇలా..

తెలంగాణ పాఠశాల విద్యార్థుల సంక్షేమం దృష్ట్యా ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఒంటి పూట బడులు నిర్వహించాలని నిర్ణయించింది. పగలు ఎండ దంచి కొడుతుంది. అప్పుడే ఎండలు మండిపోతున్నాయి. పలు ప్రాంతాల్లో అధిక ఉష్ణోగ్రతలు అత్యధికంగా నమోదవుతున్నాయి. స్కూల్స్‌లోని విద్యార్థులు వేడికి మరింత ఇబ్బంది పడుతున్నారు. ఇక ఒంటి పూట బడులకు సంబంధించి కూడా తెలంగాణ డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ కూడా క్లారిటీ ఇచ్చింది. పెరుగుతున్న ఉష్ణోగ్రతల నేపథ్యంలో మార్చి రెండో వారం నుంచి స్కూల్స్ సగం పూటే నడుస్తాయని తెలిపింది. అంటే విద్యాశాఖ అధికారుల నుంచి వస్తున్న అనధికార సమాచారం ప్రకారం మార్చి 15వ తేదీ (బుధవారం) నుంచి తెలంగాణలో ఒంటి పూట బడులు ప్రారంభం అవ్వనున్నాయి. ఒక్క పూట బడులు సమయంలో ఉదయం 7.45 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు క్లాసులు నిర్వహించనున్నారు. ఈ ఒంటి పూట బడి సమయంలో ప్రవేట్ స్కూళ్లతో పాటు ప్రభుత్వ స్కూళ్లల్లో మెరుగైన మంచినీరు పిల్లలకు అందేలా చూడాలని విద్యాశాఖ సూచించింది. ఇక తెలంగాణలో పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ఏప్రిల్ 3వ తేదీ నుంచి 13 వరకు జరుగుతాయి. మిగిలిన తరగతులకు ఏప్రిల్ 12వ తేదీ నుంచి ప్రారంభించాలని తాజాగా విద్యాశాఖ నిర్ణయించింది. 1-5 తరగతుల వారికి నాలుగు సబ్జెక్టులే అయినందున వారికి ఏప్రిల్ 17తో ముగుస్తున్నాయి.ఇక 6 నుంచి 9వ తరగతుల వారికి ఏప్రిల్ 20 వరకు ఎగ్జామ్స్ జరగనున్నాయి. ఎగ్జామ్ రిజల్ట్స్ ఏప్రిల్ 21వ తేదీన వెల్లడించి రికార్డుల్లో పొందుపరచాలని విద్యాశాఖ తెలిపింది.


ఇప్పటికే తెలంగాణ ప్రభుత్వం వేసవి సెలవుల షెడ్యూల్ విడుదల చేసిన విషయం తెల్సిందే. ఏప్రిల్ 25 నుంచి జూన్ 11 వరకు పాఠశాలలకు ఈ ఏడాది వేసవి సెలవులు ఉంటాయని విద్యాశాఖ ఇటీవల వెల్లడించింది. తిరిగి పాఠశాలలు జూన్ 12న పాఠశాలలు పున: ప్రారంభం అవ్వనున్నాయి. మొత్తం 48 రోజుల పాటు విద్యార్థులకు వేసవి సెలవులు ఉండనున్నాయి.

# భారీ భద్రత మధ్య ఈడీ ముందుకు కవిత

**న్యూఢిల్లీ**

ఢిల్లీ లిక్కర్ స్కామ్‌లో ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎమ్మెల్సీ కవితపై ఈడీ విచారణ 6గంటలుగా కొనసాగుతోంది. ఈ రోజు ఉదయం 11 గంటల 09 నిముషాలకు ఢిల్లీలోని ఎన్ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ఆఫీసుకు చేరుకున్నారు కవిత. అయితే కవిత విచారణ ప్రారంభమై ఇప్పటికి రెండు గంటలు పూర్తి అయింది. ఈ నేపథ్యంలో జాయింట్ డైరెక్టర్ సహా ఆరుగురు సభ్యులతో కూడిన టీమ్ ఎంఎల్సీ కవితను విచారిస్తున్నారు. ఇక తమ విచారణలో భాగంగా తొలి గంటలోనే ప్రశ్నలతో కవితను ఉక్కిరిబిక్కిరి చేసినట్లు తెలుస్తోంది. ఇంకా రూ. వంద కోట్ల హవాలా డబ్బుపై ప్రధానంగా ఆరా జరుపుతోంది ఈడీ. ఐటీసీ కోహినూర్ డీల్ తర్వాత హవాలాలో ఎన్నికోట్లు చేతులు మారాయి..? ఢిల్లీలోని బెంగాలీ మార్కెట్‌లో హవాలాకు సహకరించింది ఎవరు..? అని కవితను ఈడీ ఆధికారులు ప్రశ్నించారు. ఇంకా అంతకముందు ధ్వంసం చేసిన ఫోన్ల నుంచి డేటా రికవరీ చేసి కవిత ముందు ఉంచింది ఈడీ విచారణ బృంధం. దీనిపై స్పందించిన కవిత.. డబ్బు చేతులు మారిన ఆధారాలను ఈడీ ముందు పెట్టారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ విచారణకు హాజరైన కవిత ఢిల్లీలోని కేసీఆర్ నివాసం నుంచి సరిగ్గా 11 గంటలకు బయలుదేరి- అక్కడి నుంచి సరిగ్గా 1 కిలో మీటరు దూరంలోని ఈడీ ఆఫీసుకు 11. 08 గంటలకు చేరుకున్నారు. ఇఆ ఆఫీసులోకి ఒంటరిగా వెళ్లిన కవిత అక్కడ కూడా పిడికిలి బిగించి అభివాదం చేశారు. ఆ వెంటనే చేయి ఊపి ఈడీ ఆఫీసు లోపలికి వెళ్లారు. మాట్లాడేందుకు మీడియా ప్రతినిధులు ప్రయత్నించినా ఆమె మాట్లాడకుండా వెంటనే లోనికి వెళ్లారు. పిడికిలిలో పట్టుదల కనిపించినా ఆమె ముఖంలోఒకింత దిగులు కనిపించింది. అభిమానులు, పార్టీ కార్యకర్తలు అక్కడికి తరలివచ్చిన ఆమెకు సంఘీభావం ప్రకటించారు. అక్కడ పిడికిలి బిగించి కార్యకర్తలకు అభివాదం చేసి కవిత ఈడీ ఆఫీసుకు బయలుదేరారు. కారులో కూర్చున్నంత సేపు కూడా ఆమె పిడికిలి బిగించి కనిపించారు.అయితే ఈడీ ఆఫీసుకు వెళ్తున్న క్రమంలో కవిత భర్త అనిల్‌తో పాటు న్యాయవాదులు కూడా ఆమెతో ఉన్నారు. మరోవైపు కవిత ఈడీ విచారణపై ఢిల్లీలో నిరసన పెల్లుబికింది. బీజేపీలో చేరితే కేసులన్నీ మాయమంటూ ఫోటోలు వెలిశాయి. 'కవితక్కా సంఘర్ష్ కరో.. హమ్ తుమారా సాత్ హై' పేరుతో ఫ్లెక్సీలు కనిపించాయి. 'ట్రూకలర్స్ నెవర్ ఫేడ్.. బైబై మోదీ' అన్న పోస్టర్లతో ఢిల్లీ వీధులు నిండిపోయాయి. అలాగే కవిత ఈడీ విచారణ నేపథ్యంలో మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు మంతనాలు ముమ్మరం చేశారు. న్యాయనిపుణులతో ఎప్పటికప్పుడు సంప్రదింపులు జరుపుతున్నారు. అనుసరించాల్సిన వ్యూహంపై చర్చిస్తున్నారు. కవితకు సంఘీభావంగా బీఆర్ఎస్ మంత్రులతోపాటు పలుపార్టీల నేతలు తరలివస్తున్నారు. కవితకు అండగా నిలిచేందుకు మహిళలు వందలాదిగా చేరుకుని ధైర్యం చెప్పారు. కవితక్క నినాదాలతో ఆ ప్రాంతం మార్మోగుతోంది.ఇటు పోలీసులు.. అటు బీఆర్ఎస్ శ్రేణుల మోహరింపుతో కేసీఆర్ నివాసం దగ్గర ఉద్రిక్తత పెరిగింది. కార్యకర్తలను నిలువరించేందుకు ఈడీ కార్యాలయం పరిసరాల్లో పోలీసులు భారీగా మోహరించారు. ఎక్కడికక్కడ బారికేడ్లతోపాటు ఈడీ ఆఫీసు చుట్టూ మూడంచెల భద్రత ఏర్పాటు చేశారు. ఇంకా ర్యాలీలు, ధర్నాలకు ఎలాంటి అనుమతి లేదని తేల్చిచెప్పిన ఢిల్లీ పోలీసులు.. గుంపులుగా రావొద్దని సూచించారు. నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవంటూ మైక్‌లో హెచ్చరిస్తున్నారు. దీంతో ఎప్పుడేం జరుగుతుందోనన్న టెన్షన్ మొదలైంది.లిక్కర్ స్కాంలో మొత్తం 9మందిని ఈ రోజు ప్రశ్నించేందుకు సిద్ధమైంది ఈడీ. ఇప్పటికే ఈడీ కస్టడీలో ఉన్న మనీశ్ సిసోడియా, అరుణ్‌పిళ్లై, కవితతోపాటు మరో ఆరుగురిని అధికారులు విచారించనున్నారు. వీరిని విడివిడిగా ఓసారి.. అందరినీ కలిపి మరోసారి ప్రశ్నించనుంది. అయితే తెలంగాణ కోసం అలుపెరగని పోరాటం చేసిన కవితకు మద్దతుగా ఢిల్లీకి వచ్చామన్నారు మంత్రి శ్రీనివాస్‌గౌడ్. రాష్ట్ర సాధన కోసం ప్రాణాలు పణంగా పెట్టిన కవితకు యావత్ తెలంగాణ సమాజం అండగా ఉంటుందన్నారు. ఃఖీను ఎదుర్కొనే సత్తా లేకనే కేంద్రం.. ఈడీ దాడులకు పాల్పడుతోందన్నారు బీఆర్ఎస్ ఎంపీ వెంకటేశ్. వేలకోట్లతో దేశాన్ని దోచుకున్నవారిని ప్రోత్సహించడం స్కాం కాదా అని ప్రశ్నించారు. నిబంధనలకు విరుద్ధంగా ఆరు ఎయిర్‌పోర్టులను అదానీకి కట్టబెట్టడం స్కాం కాదా అంటూ ఆగ్రహం వ్యక్తంచేశారు.ఢిల్లీలో ఎంఎల్సీ కవితపై ఈడీ విచారణ సాగుతున్న క్రమంలో.. అక్కడి పరిణామాలను హైదరాబాద్‌లోని ప్రగతిభవన్ నుంచే కేసీఆర్ ఆరా తీస్తున్నారు. ఎప్పటికప్పుడు కేటీఆర్, హరీష్‌రావులను అడిగి సమీక్ష జరుపుతున్నారు. కాగా, విచారణ అనంతరం కవితను అరెస్ట్ చేసే వరకూ ఈడీ వెళ్తే.. ఢిల్లీలోని అప్ మద్దతుతో ఆందోళన కార్యక్రమాలు, పెద్ద ఎత్తున నిరసనలు జరపాలని బీఆర్ఎస్ ప్లాన్ వేసినట్లు సమాచారం. ఇప్పటికే పలువురు బీఆర్ఎస్ మంత్రులు హస్తినాలోనే ఉండగా.. మరి కొందరు బీఆర్ఎస్ నేతలు హైదరాబాద్ నుంచి ఢిల్లీకి క్యూ కడుతున్నారు. ఇంకా వారితో పాటు పలువురు మంత్రులు, బీఆర్ఎస్ పార్టీలోని కొందరు కీలక నేతలు కూడా ఉన్నారని తెలుస్తోంది.

ప్రజా తపన
prajathapana.com
News that matters



















Printed, Published & Owned by K.Umadevi And Printed at Varadhi Publications,D.No:5-1-24/66 Lakshmipuram, Hindupur-515201,Sri Satya Sai District, Andhrapradesh.Published at D.No:5-1-24/66 Lakshmipuram, Hindupur-515201,Sri Satya Sai District, Andhrapradesh. EDITOR :K.Umadevi ,
e mail ID : b.nagaseshu47@gmail.com cell No:9985509053 RNI/APTEL/2021/80950